


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

www.rajamudranews.com

అక్షర
# రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA
RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | శనివారం | 28.02.2025 | సంపుటి : 3 | సంచిక : 27 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | SATURDAY | 28.02.2025 | volume : 3 | Issue : 27 | Pages : 8 | Cost : 2/- |

విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9182 474 575

### ఢిల్లీ మద్యం కేసులో అభియోగాలే తప్ప
# ఆధారాలేవీ..

● కేసును కొట్టివేస్తూ సిబిఐపై కోర్టు తీవ్ర వ్యాఖ్యలు ● ఆధారాలు లేకుండా కేసు నడిపారని మండిపాటు ● కేజీవ్రాల్, సిసోడియా, కవితలపై కేసు కొట్టివేత ● ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేస్తామని సిబిఐ వెల్లడి



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 27 :** ఢిల్లీ మద్యం లిక్కర్ పాలసీ కేసును ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు కొట్టి వేసింది. ఈ కేసులో దోషులుగా ఉన్న దిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజీవ్రాల్ , మాజీ ఉప ముఖ్యమంత్రి సిసోదియా, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎంపీ కవిత కు భారీ ఊరట లభించింది. మద్యం పాలసీ కేసుపై తాజాగా విచారణ జరిపిన రౌస్ అవెన్యూ కోర్టు నిందితులందరి పైన నమోదు చేసిన కేసులు కొట్టివేసింది. వారందరి పేర్లను డిశ్చార్జ్ చేసినట్లు వెల్లడించింది. సరైన ఆధారాలు లేకుండానే వీరి పేర్లు కేసులో చేర్చారని సీబీఐపై ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ కేసులో పూర్తిగా లోపభూయిష్టమైన దర్యాప్తు జరిగిందని కోర్టు సీబీఐపై మండిపడింది. ఈ విషయంలో సీబీఐ అధికారుల పైనే దర్యాప్తు మిగతా2లో...

### దోమల నివారణ, శానిటేషన్‌పై
# ప్రత్యేక దృష్టి



● కేటాయించిన స్థలంలోనే చెత్త వేసేలా అవగాహన ● హోటల్స్‌లో ఫుడ్ సేఫ్టీకి ప్రత్యేక చర్యలు
● అవసరమైతే కిచన్‌లలో సిసి కెమెరాల ఏర్పాటుతో పరిశీలన
● మున్సిపల్ శాఖపై సమీక్షలో సిఎం రేవంత్ సూచనలు

**హైదారాబాద్,ఫిబ్రవరి 27 :** శానిటేషన్, దోమల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు దిశానిర్దేశంచేశారు. మున్సిపల్ అధికారులు మార్క్ చేసిన చోటనే చెత్త వేసేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులతో సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సమావేశానికి సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు సీఎం పలు సూచనలు చేశారు. ఎప్పటికప్పుడు పనులు పూర్తి చేసేందుకు అవసరమైతే టెక్నాలజీని ఉపయోగించాలని సీఎం రేవంత్‌రెడ్డి మార్గనిర్దేశం చేశారు. కోర్ అర్బన్ రీజియన్‌లో ఉన్న అన్ని స్ట్రీట్‌లైట్స్‌కు ప్రత్యేక నెంబర్ ఇచ్చి డ్యాష్ బోర్డుకు కనెక్ట్ చేయాలని సూచించారు. టెక్నాలజీ ద్వారా సమస్య తలెత్తిన చోట వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. నగర పరిధిలో ఫుడ్ సేఫ్టీకి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. హోటల్స్‌లోని కిచెన్‌లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించాలని దిశానిర్దేశం చేశారు. తరచూ తనిఖీలు నిర్వహించడంతో పాటు ప్రత్యేక మానిటరింగ్ వింగ్ ఎప్పటికప్పుడు పరిశీలించేలా చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్దేశించారు. హోటల్స్‌కి రేటింగ్, సర్టిఫికేట్ ఇచ్చే విధానాన్ని పరిశీలించాలని సూచించారు. మిగతా2లో...

### రాష్ట్రంలో కాంగ్రెస్ ఉన్నా..
# నడిగడ్డ బిఆర్ఎస్ వెనకే...

- పాలమూరులో గెలిచిన కౌన్సిలర్లకు సన్మానం - రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందన కెటిఆర్




**హైదారాబాద్,ఫిబ్రవరి 27 :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పటికీ నడిగడ్డలో మాత్రం ప్రజల విశ్వాసం ఇప్పటికీ బీఆర్ఎస్ పైనే ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. నడిగడ్డ స్ఫూర్తి రాష్ట్రం మొత్తం వ్యాపించాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ తరఫున గెలిచిన కౌన్సిలర్లకు తెలంగాణ భవన్‌లో సన్మానించారు. సర్పంచ్ ఎన్నికల నుంచి మున్సిపల్ ఎన్నికల వరకు మెజారిటీ స్థానాలు గెలుచుకోవడం పార్టీ బలాన్ని నిరూపిస్తోందన్నారు. ఆలంపూర్, ఐజ, గద్వాల, వడ్డేపల్లి ప్రాంతాల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు అందించిన మద్దతు విశేషమని తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం అరాచక పాలన నడుస్తోందని కేటీఆర్ విమర్శించారు. మిగతా2లో...

### జీఐ ఆన్ వీల్స్..
# టీజీఎస్ఆర్టీసీ శ్రీకారం

● బస్సులపై జీఐ వారసత్వ ప్రదర్శన
● జీఐ హస్తకళలతో అలంకరించిన ప్రత్యేక బస్సులు
● జెండా ఊపి ప్రారంభించిన గవర్నర్ , మంత్రి పొన్నం




**హైదారాబాద్,ఫిబ్రవరి 27 :** దేశంలోనే తొలిసారిగా 'జీఐ ఆన్ వీల్స్' కార్యక్రమాన్ని శుక్రవారం హైదరాబాద్‌లోని మహాత్మా గాంధీ బస్ స్టేషన్ వద్ద తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రారంభించారు. కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ , టీజీఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ / మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డి , హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి పాల్గొన్నారు. సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, జీఐ గుర్తింపు పొందిన కళారూపాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, వాటిని ప్రాచుర్యంలోకి తీసుకురావడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ మని అన్నారు. తెలంగాణ యువ రాష్ట్రంగా సాంస్కృతిక గుర్తింపును బలోపేతం మిగతా2లో...



### న్యాయవ్యవస్థపై పెట్టుకున్న
# నమ్మకం నిలబడింది

● కడిగిన ముత్యంలా బయటకు వస్తానని ఆనాడే చెప్పా...
● కష్టకాలంలో అండగా నిలిచి వారిందరికీ కృతజ్ఞతలు
● ఢిల్లీ కోర్టు తీర్పుపై కవిత హర్షం

**హైదారాబాద్,ఫిబ్రవరి 27 :** న్యాయ వ్యవస్థపై తాను పెట్టుకున్న నమ్మకం నిలబడిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎంపీ కవిత అన్నారు. తను నిందితురాలిగా ఉన్న దిల్లీ మద్యం కేసును కోర్టు కొట్టివేసిన నేపథ్యంలో హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. నేను కడిగిన ముత్యంలా బయటికి వస్తానని తెలంగాణ ప్రజలకు మొదట్నుంచి చెబుతున్నాను. అలాగే వచ్చాను. మిగతా2లో...

### ఎపి కొత్త సిఎస్‌గా
# సాయిప్రసాద్

● నేడు బాధ్యతలు స్వీకరించనున్నట్లు వెల్లడి



వివరాలు 2లో

# నేటి నుంచి హెచ్‌పీవీ వ్యాక్సినేషన్




**హైదారాబాద్,ఫిబ్రవరి 27:** రాష్ట్రంలో సర్వైకల్(గర్భాశయ ముఖద్వార) క్యాన్సర్ నివారణ లక్ష్యంగా నేటి నుంచి హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ) వ్యాక్సినేషన్ డ్రైవ్ నిర్వహించను న్నారు. కింగ్ కోఠి జిల్లా దవాఖానలో నేడు (శనివారం) ఉదయం 11 గంటలకు వ్యాక్సినేషన్ పంపిణీ కార్యక్రమాన్ని ఆరోగ్యశాఖ మంత్రి మిగతా2లో...

# తమిళనాడు ఒకే విడతలో ఎన్నికలు

● పరిశీలనలో ఉందన్న ఎన్నికల సంఘం ఛైర్మన్




వివరాలు 2లో

# జూబ్లీహిల్స్‌లో ఫ్లై ఓవర్ పనులు ప్రారభం

● ట్రాఫిక్ మళ్లింపు చేపట్టిన పోలీసులు
● పనులు పరిశీలించిన సిపి సజ్జన్నార్



**హైదరాబాద్,27 :** బంజారాహిల్స్ రోడ్ నెంబర్-2లో పార్క్ హయత్ వద్ద ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు ప్రారంభమ య్యాయి. నిర్మాణ పనులని మేఘా నిర్మాణ సంస్థ ప్రారంభించింది. వంతెన నిర్మాణ పనులు ప్రారంభమైన ప్రాంతాన్ని హైదరాబాద్ సీపీ సజ్జనార్ పరిశీలించారు. సీపీ సజ్జనార్‌తో పాటు ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవి స్ నిర్మాణ సంస్థ ప్రతినిధులు పరిశీలించారు. ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు ప్రా రంభమైన సందర్భంగా శుక్రవారం నుంచి పలుమార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. మిగతా2లో...

### లొంగిన మావోయిస్టులకు
# అండ

● రివార్డులు త్వరగా అందచేస్తాం
● లొంగిన నేతలతో సిఎం రేవంత్ భేటీ



**హైదారాబాద్,ఫిబ్రవరి 27 :** మావోయిస్టుల అగ్రనేతలతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం సచివాలయంలో సమావేశం అయ్యారు. ఈ క్రమంలో మావోయిస్టుల లొంగుబాటు పాలసీపై సీఎం చర్చించారు. ఈ సందర్భంగా ఒక్కొక్కరిని పలకరించారాయన. మావోయిస్టుల పునరావాసంపై హామీ ఇచ్చారు. లొంగిపోయిన మావో నేతలపై ఉన్న రివార్డును వెంటనే అందించేలా మిగతా2లో...

# ఢిల్లీ మద్యం కేసులో అభియోగాలే తప్ప ఆధారాలేవీ

(మొదటి పేజీ తరువాయి)

జరగాలని కోర్టు పేర్కొంది. కవిత ఆడిటర్ బుచ్చిబాబు సహా అభియోగాలు మోపిన 23 మందికి ఈ కేసు నుంచి విముక్తి కల్పిస్తున్నట్లు తెలిపింది. వారిపై ఉన్న అభియోగాలను నిరూపించడంలో సీబీఐ విఫలమైందని వ్యాఖ్యానించింది. ఎటువంటి ఆధారాలు లేకుండా కేవలం ఊహాగానాల ఆధారంగా ఈ కేసులో కుట్ర జరిగిందని సీబీఐ అధికారులు ఆరోపించారని న్యాయ స్థానం పేర్కొంది. కానీ దానిని నిరూపించడంలో విఫల మయ్యారని ఆగ్రహం వ్యక్తంచేసింది. ఎక్సైజ్ పాలసీపై ముగ్గురు న్యాయ నిపుణుల అభిప్రాయాలు తమ కేసుకు మద్దతు ఇస్తున్నాయని గతంలో సీబీఐ చేసిన ప్రకటనపై స్పష్టత ఇవ్వాలని అధికారులను ఆదేశించింది. ఈ కోర్టు తీర్పును సవాలుచేస్తూ సీబీఐ అధికారులు ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించనున్నట్లు తెలుస్తోంది. ఢిల్లీ ప్రభుత్వం 2021 నవంబర్ 17న మద్యం పాలసీని తీసుకొచ్చింది. 2022 సెప్టెంబరు చివరికి దానిని వెనక్కి తీసుకుంది. ఈ మధ్యలో మద్యం విధానంలో పలు అవకతవకలు జరిగాయని.. ఆప్ నేతలు మనీలాండరింగ్‌కు పాల్పడ్డారంటూ ఆరోపణలు వచ్చాయి. ఎక్సైజ్ పాలసీని సవరించేటప్పుడు వీరు అక్రమాలకు పాల్పడ్డారని సీబీఐ, ఈడీలు ఆరోపించాయి. లైసెన్స్‌దారులకు అవసరమైన సాయం చేసి, ప్రతిఫలంగా కొంత మొత్తాన్ని పొందినట్లు దర్యాప్తు సంస్థలు చెప్పాయి. ఈ కుంభకోణంలో భాగంగా ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజీవ్రాల్, మాజీ ఉప ముఖ్యమంత్రి సిసోదియా, ఇతర ఆప్ నేతలు, మాజీ తెలంగాణ ఎంపీ కవితలను అధికారులు అరెస్టు చేశారు. వారు బెయిల్‌పై విడుదలయ్యారు. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజీవ్రాల్‌కు భారీ ఊరట లభించింది. సీబీఐ కోర్టు ఈ కేసునుంచి కేజీవ్రాల్‌ను డిశ్చార్జ్ చేసింది. శుక్రవారం ఢిల్లీ మద్యం పాలసీ కేసుపై ది రౌస్ అవెన్యూ కోర్టు విచారణ జరిపింది. సీబీఐ వేసిన చార్జ్‌షీట్‌లో మెరిట్ లేదని కోర్టు పేర్కొంది. మాజీ ముఖ్యమంత్రి కేజీవ్రాల్‌తో పాటు ఉప ముఖ్యమంత్రి సిసోడియాకు కూడా క్లీన్‌చిట్ ఇచ్చింది. కవితతో పాటు 23 మంది నిందితులు తప్పు చేసినట్టు సాక్ష్యాధారాలు లేవని కోర్టు స్పష్టం చేసింది. అందరికీ క్లీన్ చిట్ ఇచ్చింది. అయితే, రౌస్ అవెన్యూ కోర్టు తీర్పును సీబీఐ సవాల్ చేయనుంది.

# జీఐ ఆన్ వీల్స్.. టీజీఎస్ఆర్టీసీ శ్రీకారం

(మొదటి పేజీ తరువాయి)

చేసుకోవడం అవసరమని తెలిపారు. సంస్కృతి సమాజానికి ఆత్మస్వరూపమని, సాంస్కృతిక అవగాహన లేకుండా సమాజం అభివృద్ధి సాధ్యం కాదని అన్నారు. ఈ తరహా కార్యక్రమాలు యువతలో సంప్రదాయ కళలపై ఆసక్తిని పెంచుతాయని, కళాకారులకు గౌరవాన్ని కల్పిస్తాయని పేర్కొన్నారు. రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ఈ కార్యక్రమం గవర్నర్ గారి దూరదృష్టి ఫలితమని తెలిపారు. జీఐ ఉత్పత్తుల ప్రాచుర్యం, మార్కెటింగ్ మరియు విస్తరణకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. ఈ చర్యల ద్వారా గ్రామీణ కళాకారులకు ఉపాధి అవకాశాలు పెరిగి, ఆర్థిక స్థితి మెరుగుపడుతుందని చెప్పారు. టీజీఎస్ఆర్టీసీ ద్వారా ఈ కార్యక్రమాన్ని విస్తృత స్థాయిలో అమలు చేయడానికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా పోచంపల్లి ఇక్కత్ వరంగల్ , వరంగల్ తివాచీలు (కార్పెట్లు), కరీంనగర్ సిల్వర్ ఫిలిగ్రీ, నారాయణపేట్ చీరలు, చెరియల్ స్క్రోల్ పెయింటింగ్స్, నిర్మల్ పెయింటింగ్స్ వంటి తెలంగాణకు చెందిన ఆరు ప్రముఖ జీఐ హస్తకళలను బస్సులపై ప్రత్యేకంగా ప్రతిష్టించారు. ఈ కళారూపాలు తెలంగాణ కళాకారుల నైపుణ్యానికి ప్రతీకలుగా నిలుస్తూ, ప్రజా రవాణా ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత ప్రచారం పొందనున్నాయి. ప్రజా రవాణా వ్యవస్థను సృజనాత్మక వేదికగా మలచి, తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రజలకు చేరవేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా చేపట్టటం జరిగిందని మంత్రి స్పష్టం చేశారు. మేనేజింగ్ డైరెక్టర్ నాగి రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రతిబింబించే ఈ కార్యక్రమం గవర్నర్ గారి ఆలోచనల ఫలితమని తెలిపారు. బస్సులపై జీఐ కళారూపాలను ప్రదర్శించడం ద్వారా సంస్కృతిని ప్రజలకు చేరువ చేయడంతో పాటు కళాకారులకు ప్రోత్సాహం అందించడమే లక్ష్యమని చెప్పారు. బస్సులపై ప్రదర్శించిన డిజైన్లను జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ విద్యార్థులు రూపొందించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నగదు బహుమతులు మెమొంటోలు అందజేశారు. జీఐ గుర్తింపుల సాధనలో సేవలందించిన సుభజిత్ సహా ప్రత్యేకంగా సన్మానించారు. ఆరు జీఐ కళారూపాలకు చెందిన కళాకారులను కూడా ఘనంగా సత్కరించారు. తదనంతరం గవర్నర్ , మంత్రి , జిల్లా కలెక్టర్ టీజీఎస్ఆర్టీసీ అధికారులు కలిసి జీఐ హస్తకళలతో అలంకరించిన ప్రత్యేక బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. ÷బిగోళిక సూచిక (జీఐ) అనేది ఒక ప్రాంతానికి ప్రత్యేకమైన ఉత్పత్తి లక్షణాలు, నైపుణ్యం, సంప్రదాయాన్ని ప్రతిబింబించే సమిష్టి మేధో సంపత్తి హక్కు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రానికి 18 జీఐ గుర్తింపు పొందిన ఉత్పత్తులు ఉన్నాయి. జీఐ గుర్తింపు ద్వారా సంప్రదాయ కళలు, వారసత్వాన్ని సంరక్షించడం, నకిలీలను నివారించడం, కళాకారులకు గుర్తింపు కల్పించడం, వారి జీవనోపాధిని స్థిరంగా నిలుపుటకు దోహదపడుతుంది. కార్యక్రమంలో టీజీఎస్ఆర్టీసీ ఉన్నతాధికారులు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు రాజశేఖర్ , శ్రీ ఖుస్రో షా ఖాన్, రీజినల్ మేనేజర్లు శ్రీలత , సుధ పరిమళ , జేఎన్ఏఎఫ్ఏయూ ప్రతినిధులు, కళాకారులు మరియు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో కాంగ్రెస్ ఉన్నా..నడిగడ్డ బిఆర్ఎస్ వెనకే...

(మొదటి పేజీ తరువాయి)

నాగర్‌కర్నూల్‌లో రెండు నెలల పాప మరణ ఘటన, కోదాడలో దళిత యువకుడు కర్ల రాజేష్ లాకప్ డెత్ వంటి ఘటనలు ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. ఖమ్మం వెలుగుమట్లలో ఇళ్ల కూల్చివేతలు ప్రజలను రోడ్డున పడేసిన దారుణ చర్యలని ఆక్షేపించారు. కేసీఆర్ నాయకత్వంలో గతంలో అభివృద్ధి, సంక్షేమం రెండు జోడెడ్లలా ముందుకు సాగాయని, కానీ ప్రస్తుతం రాష్ట్రంలో అవినీతి, అరాచకం జోడెడ్లుగా మారాయని విమర్శించారు. చెక్ డ్యామ్‌లు పేల్చడం, ప్లలె ప్రకృతి వనాల్లో చెట్ల నరుకులు వంటి చర్యలు రాష్టాన్ని వెనక్కి నెడుతున్నాయని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని, రైతు బంధు, ఎరువుల సరఫరా వంటి అంశాల్లో రైతులను తీవ్రంగా నిరాశపరిచిందని పేర్కొన్నారు. ప్రజలకు ఇప్పుడు కాంగ్రెస్ నిజ స్వరూపం అర్థమైందన్నారు. ఎమ్మెల్సీ చల్ల వెంకట్రామి రెడ్డి ప్రజల సమస్యలపై అంకితభావంతో పనిచేసే నాయకుడని, ఎమ్మెల్యే విజయుడు కూడా అదే తత్వాన్ని కొనసాగిస్తున్నారని ప్రశంసించారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లను ప్రలోభాలకు గురిచేసే ప్రయత్నాలు చేస్తుందని ముందుగానే హెచ్చరించిన కేటీఆర్, పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మరోసారి కేసీఆర్ నాయకత్వంలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# న్యాయవ్యవస్థపై పెట్టుకున్న నమ్మకం నిలబడింది

(మొదటి పేజీ తరువాయి)

ఇది కేవలం రాజకీయ కక్షతో పెట్టిన కేసు అని ఎన్నోసార్లు చెప్పాను. అదే నిజమైంది. దీంతో నేను, నా కుటుంబం కొన్ని నెలలపాటు క్షోభ అనుభవించాం. విపక్షాలను వేధించేందుకు దర్యాప్తు సంస్థలను వాడుకుంటున్నారు. కోర్టు తీర్పు రాకుండానే నాపై కొందరు అనుచితంగా మాట్లాడారు. కష్ట సమయంలో అండగా నిలిచిన అందరికీ ధన్యవాదాలు. మరింత ఉత్సాహంతో ప్రజలకు సేవ చేస్తాను అని కవిత అన్నారు. కోర్టు తీర్పు వెలువడిన అనంతరం 'సత్యమేవ జయతే' అని 'ఎక్స్'లో ఆమె పోస్ట్ చేశారు. ఢిల్లీ లిక్కర్ కేసులో రౌస్ అవెన్యూ కోర్టు కీలక తీర్పు వెల్లడించింది. లిక్కర్ పాలసీ అవినీతి కేసులో సరైన ఆధారాలు లేవని వ్యాఖ్యలు చేసింది. సీబీఐ సరైన మెటీరియల్ లేకుండా కేసులో ఇరికించిందని కోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. భారీ ఛార్జ్‌షీట్‌లో అనేక లోపాలు ఉన్నాయని, వాటికి సాక్షులు లేదా స్టేట్‌మెంట్ల మద్దతు లేదని స్పష్టం చేసింది. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు భారీ ఊరట లభించింది. కవితకు క్లీన్ చీట్ ఇచ్చింది రౌస్ అవెన్యూ కోర్టు కవితపై సీబీఐ నమోదు చేసిన అభియోగాలన్నిటిని కొట్టివేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు సీబీఐ ప్రత్యేక కోర్టు జడ్జి జితేందర్ సింగ్. అరవింద్ కేజీవ్రాల్, సిసోడియాతో పాటు కవితకు క్లీన్ చిట్ ఇచ్చింది. లిక్కర్ కేసులో ఐదు నెలల పాటు కవిత జైల్లో ఉన్నారు. లిక్కర్ కేసులో కోర్టు తీర్పుపై కవిత స్పందించారు. కవిత మాట్లాడుతూ.. నిజం గెలిచింది.. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసు నుంచి కడిగిన ముత్యంలా బయటకు వచ్చా.. నా తల్లిదండ్రులు, అత్తామామలు మాకు అండగా నిలిచారు.. కేసీఆర్, బీఆర్ఎస్‌ని టార్గెట్ చేయడానికే ఈ కేసు పెట్టారు.. నన్ను మూడేళ్ల పాటు నానా మాటలు అన్నారు.. సోషల్ మీడియాలో ట్రోల్స్ చేశారు.. రాజకీయ కుట్రతోనే ఈ కేసు పెట్టారని నిరూపితమైంది.. నాకు అండగా నిలిచిన వారిని మరిచిపోను అంటూ కవిత భావోద్వేగానికి గురైంది.


# మెడికల్ సీట్ల పేరుతో వందమందికి మోసం

- ఇద్దరు కేటుగాళ్లను అరెస్ట్ చేసిన పోలీసులు

**హైదరాబాద్,ఫిబ్రవరి 27 :** మెడికల్ సీట్లు ఇప్పిస్తామని చెప్పి దాదాపు 40 లక్షల రూపాయలు మోసం చేసిన ఘటన కుత్బుల్లాపూర్, పేట్ బాషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. శుక్రవారం మోసానికి పాల్పడిన ఇద్దరు కేటుగాళ్లను పేట్ బాషీరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. జీడిమెట్ల విలేజ్ లోని ఓ బాధితుని ఫిర్యాదు ఆధారంగా ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్టు ఎస్.హెచ్ఓ తెలిపారు. ఈ కేసులో ఇద్దరు నిందితులు అర్వింద్ రావు(40), న్యూఢిల్లీ, వెంకటరావు(58) హైదరాబాద్ లో అరెస్ట్ చేశారు. దేశవ్యాప్తంగా నీట్ ర్యాంకులు సాధించిన విద్యార్థులే టార్గెట్ గా దాదాపు 100 మందిని మోసం చేసినట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. దాదాపు 2 కోట్ల50 లక్షలకు పైగా మోసం చేసినట్టు పోలీసుల వెల్లడించారు. నిందితుల నుంచి నకిలీ అలాట్‌మెంట్ లెటర్స్, ఐడీలు, నకిలీ ఒప్పందపత్రాలు, 4 మొబైల్స్ స్వాధీనం చేసుకున్నట్లు ఈ సందర్భంగా పోలీసులు తెలిపారు.

# చిలకూరు పూర్వ ప్రధానార్చకులు సౌందర్ రాజన్ కన్నుమూత

- మృతికి పలువురు ప్రముఖులు సంతాపం



**హైదరాబాద్,ఫిబ్రవరి 27 :** చిలుకూరు బాలాజీ ఆలయ పూర్వ ప్రధాన అర్చకుడు సౌందర్ రాజన్ (90) కన్నుమూశారు. గత కొన్నాళ్లుగా వృద్ధాప్య సమస్యల కారణంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన.. శుక్రవారం చిలుకూరులోని నివాసంలో కన్నుమూశారు. ఈ మేరకు ఆయన తనయుడు, ఆలయ ప్రస్తుత ప్రధాన అర్చకుడు రంగరాజన్ వెల్లడించారు. హైదరాబాద్‌లోని ఈ ప్రసిద్ధ ఆలయాన్ని సౌందర్ రాజన్ ఎంతో కాలం క్రమశిక్షణతో, సేవానిరతితో నిర్వహిం చారు. భక్తులతో మమేకమై స్వామి వారి ప్రసాదాన్ని, సేవా విధానాన్ని ఎంతో ప్రశాంతంగా వివరించేవారు. వీసా దేవుడిగా చిలుకూరి ఆలయాన్ని ఆయన ప్రసిద్ధి పొందేలా చేశారు. ఇక్కడ భక్తులందరికీ ఒకేతరహా దర్శనంతో అవకాశ కల్పించారు. హుండీ లేకుండా చేశారు. భక్తులు నేరుగా దర్శనం కలిగించు కునేలా ఆలయాన్ని తీర్చిదిద్దారు. అలాగే ఆలయాన్ని స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వం ప్రయత్నించినా కోర్టుల ద్వారా దివంగత సౌందర్ రాజన్ పోరాడి అడ్డుకున్నారు. ఇకపోతే సౌందర్ రాజన్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో కామర్స్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. సుదీర్ఘ కాలం ప్రొఫెసర్‌గా, తరవాత ఆయన ఉస్మానియా వర్సిటీ రిజిస్ట్రార్‌గా కూడా పనిచేసి రిటైర్ అయ్యారు. తరవాత వంశపారంపర్య ఆలయ అర్చకవృత్తిలో స్థిరపడ్డారు. ఆయన మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు. సమాచారశాఖ మాజీ కమిషనర్ కెవి రమణాచారి, తెలంగాణ శ్రీవైష్ణవసంఘం ప్రతినిధులు కూడా సంతాపం తెలిపారు.

# ఎపి కొత్త సిఎస్‌గా సాయిప్రసాద్

**అమరావతి,ఫిబ్రవరి 27 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి జి.సాయి ప్రసాద్ పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుత సీఎస్ కె.విజయానంద్ పదవీ కాలం ఫిబ్రవరి 28తో ముగియనుంది. ఆయన స్థానంలో సాయి ప్రసాద్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఇప్పటికే అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. శనివారం ఉదయం ఆయన ఏపీ సచివాలయంలో నూతన సీఎస్‌గా పదవీ బాధ్యతలు చేపడతారు. 1991 ఐఏఎస్ బ్యాచ్ ఏపీ క్యాడర్‌కు చెందిన జి.సాయి ప్రసాద్ ఎంటెక్ పూర్తిచేశారు. 1991 ఐఏఎస్‌కు ఎంపికై 1992 నుంచి 1993 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వరంగల్ అసిస్టెంట్ కలెక్టర్‌గా పనిచేశారు. అనంతరం 1993 నుంచి 1995 వరకు పాడేరు అసిస్టెంట్ కలెక్టర్‌గా పనిచేశారు. 1995 నుంచి 1997 వరకు గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా విధులు నిర్వహించారు. 1997 నుంచి 1998 వరకు కడప జాయింట్ కలెక్టర్‌గా పనిచేశారు. 2000 నుంచి 2003 వరకూ కర్నూల్ జిల్లా కలెక్టర్‌గా పనిచేశారు. 2010 నుంచి 2011 వరకు ఏపీ హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్‌గా విధులు నిర్వహించారు. 2024 జూన్ నుంచి 2025 జనవరి వరకు జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న సాయి ప్రసాద్ శనివారం నూతన సీఎస్‌గా పదవీ బాధ్యతలు చేపట్టబోతున్నారు.

# తమిళనాడు ఒకే విడతలో ఎన్నికలు

**చెన్నై,ఫిబ్రవరి 27:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు ఒకే విడతలో నిర్వహించాలని పలు పార్టీలు సూచించినట్టు సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తెలిపారు. వారి విజ్ఞప్తులను వివిధ కోణాల నుంచి పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పుడే దీనిపై ఒక స్పష్టత ఇస్తామని అన్నారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల సన్నద్ధతపై జ్ఞానేశ్ కుమార్ శుక్రవారంనాడు సమీక్ష జరిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ఇటీవల రాష్ట్రంలో జరిపిన ఎస్ఐఆర్ పక్రియ దేశానికే ఒక మోడల్‌గా నిలిచిందని, విజయవంతంగా ఈ పక్రియ పూర్తయిందని చెప్పారు. ఎస్ఐఆర్‌తో పెద్ద ఎత్తున ఓటర్లను జాబితా నుంచి తొలగించనున్నట్టు కొన్ని రాజకీయల పార్టీలు విమర్శించినప్పటికీ, ఓటర్ల జాబితా ప్రక్షాళన విషయంలో ఈసీ అధికారులు ఎంతో ప్రొఫెష నలిజం కనబరిచారని ప్రశంసించారు. ఇటీవల కాలంలో ఏమాత్రం పొరపాట్లకు తావీయకుండా బీహార్ ఎన్నికలు జరిగాయని, అంతకు మించి మరింత మెరుగ్గా తమిళనాడులో ఎన్నికలు నిర్వహిస్తా మని, సరికొత్త రికార్డు సృష్టిస్తామని తెలిపారు. ఓట్ల లెక్కింపు పక్రియ పూర్తయిన ఏడు రోజుల వరకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల్లో నమోదైన ఓట్లతో వీవీపాట్ల స్లిప్పులను చేసుకోవడానికి అభ్యర్థులను అనుమతిస్తామని సీఈసీ తెలిపారు. అయితే ఇందుకు కొంత మొత్తం చెల్లించాలని అన్నారు. ఈవీఎం రౌండ్లకు ముందు పోస్టల్ బ్యాలెట్లను రెండు రౌండ్లు కౌంటింగ్ జరుపుతామని చెప్పారు.

# దోమల నివారణ, శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి

(మొదటి పేజీ తరువాయి)

ఫైర్ సేఫ్టీ విషయంలో అడ్వాన్స్‌డ్ ఎక్విప్‌మెంట్ వినియోగించాలని మార్గనిర్దేశం చేశారు. నగరంలోని సిగ్నల్ జంక్షన్స్, సర్కిల్స్‌లో వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ ఏర్పాటు చేసి వర్షపు నీటిని ఒడిసి పట్టాలని సూచించారు. ఇందుకు ముందుగా కొన్ని ఏరియాలను గుర్తించి పైలట్ ప్రాజెక్టుగా వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ ఏర్పాటు చేయాలిని సీఎం రేవంత్‌రెడ్డిసూచన చేశారు. టెక్నాలజీ ద్వారా సమస్య తలెత్తిన చోట వెంటనే పరిష్కారం జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. హోటల్స్ లోని కిచెన్ లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ సెంటర్ కు అనుసంధానించాలి తరచూ తనిఖీలు నిర్వహించడంతో పాటు ప్రత్యేక మానిటరింగ్ వింగ్ ఎప్పటికప్పుడు పరిశీలించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇందుకు ముందుగా కొన్ని ఏరియాలను గుర్తించి పైలట్ ప్రాజెక్టుగా వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ ఏర్పాటు చేయాలన్నారు.

# లొంగిన మావోయిస్టులకు అండ

(మొదటి పేజీ తరువాయి)

చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అనుమతిస్తే జైల్లో ఉన్న మావోయిస్టులను కలుస్తామని మావోయిస్టు నేతలు పేర్కొన్నారు. అలాగే , లొంగిపోయిన మావోయిస్టుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. లొంగిపోవ టానికి చొరవ చూపిన ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌కి మావోయిస్ట్ నేతలు ధన్యవాదాలు తెలిపారు. చట్టప్రకారం పునరావాసం, రక్షణ పరమైన సహకారం తమ ప్రభుత్వం అందిస్తుందని భరోసా కల్పించారు. మావోయిస్టుల లొంగుబాటుపై తెలంగాణ అసెంబ్లీలో ప్రకటన చేస్తానని తెలిపారు. మావోయిస్టులతో రాష్ట్ర ప్రభుత్వం జరిపిన చర్చలు బాగున్నాయని మావోయిస్టులు అన్నారు. ఈ ప్రభుత్వ లొంగుబాటు పాలసీ బాగుందని సీఎంకు మావోయిస్టు అగ్రనేత దేవ్‌జీ తెలిపారు. తమ భవిష్యత్ ప్రణాళికలపై సీఎం రేవంత్‌రెడ్డికి మావోయిస్టు అగ్రనాయకులు వివరించారు.

# జూబ్లీహిల్స్‌లో ఫ్లై ఓవర్ పనులు ప్రారభం

(మొదటి పేజీ తరువాయి)

సీపీ సజ్జనార్ మీడియాతో మాట్లాడారు. ఇందులో భాగంగా కేబీఆర్ పార్క్ చుట్టూ ఏడు ఫ్లై ఓవర్ , ఏడు అండర్ పాసుల నిర్మాణం జరుగుతోందని తెలిపారు. ఈ రోజు పనులు మొదలయ్యాయని పేర్కొన్నారు. ఇవాళ నుంచి నిర్మాణ పనుల కారణంగా ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని సీపీ సజ్జనార్ చెప్పుకొచ్చారు. ఇప్పటికే వాహనదారులకు పలు సూచనలు చేశామని అన్నారు. రెండు సంవత్సరాల్లో నిర్మాణ పనులు పూర్తి చేయాలని ప్లాన్ చేశామని తెలిపారు. నిర్మాణ సమయంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా ఎలాన్ చేశామని చెప్పుకొచ్చారు. ఫ్లై ఓవర్ నిర్మాణ సమయంలో ప్రజలు సహకరించాలని కోరారు. వివిధ ప్రాంతాల్లో నిర్మాణ పనులు దశల వారీగా జరుగుతాయని వెల్లడించారు. రాత్రి వేళ ఎక్కువగా పనులు చేయాలని నిర్మాణ సంస్థలను కోరామని అన్నారు. బేస్‌మెంట్ పూర్తి అయితే తర్వాత ట్రాఫిక్ ఆంక్షలు సవరించే అవకాశం ఉంటుందని తెలిపారు. 7 అండర్ పాసులు, 7 ఫ్లై ఓవర్ అందుబాటులోకి వస్తే ఆయా రోడ్లు సిగ్నల్ ఫ్రీగా మారుతాయని హైదరాబాద్ సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. బీఆర్ పార్కు చుట్టూ 7 ఫ్లై ఓవర్లు, ఏడు అండర్ పాసుల నిర్మాణం ప్రారంభమైందని హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ తెలిపారు.

# నేటి నుంచి హెచ్‌పీవీ వ్యాక్సినేషన్

(మొదటి పేజీ తరువాయి)

దామోదర్ రాజనర్సింహ ప్రారంభించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 4లక్షల మంది బాలికలకు వ్యాక్సిన్ ఇవ్వనున్నారు.

# రాష్ట్రంలో కేన్సర్ నివారణ దిశగా మరో ముందడుగు

**హైదరాబాద్,ఫిబ్రవరి 27 :** సర్వైకల్ కేన్సర్ నివారణెళి లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా నేటి నుంచి హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ చేపట్టనున్నారు. కింగ్ కోఠి డిస్ట్రిక్ట్ హాస్పిటల్‌లో శనివారం ఉదయం 11 గంటలకు వ్యాక్సినేషన్ పంపిణీ కార్యక్రమాన్ని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రారంభించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 4 లక్షల మంది బాలికలకు వ్యాక్సిన్ ఇవ్వనున్నట్లు ఆరోగ్యశాఖ తెలిపింది.

## పివి ఫంక్షన్ హాల్ ను ప్రారంభించిన ఎంపీ రఘురాం రెడ్డి



**ఖమ్మం, రాజముద్ర న్యూస్** సామాన్యులకు అందుబాటులో ఉండే విధంగా ఫంక్షన్ హాల్ ను నిర్మించడం అభినందనీయం అని ఖమ్మం ఎంపి రామసహాయం రఘురాం రెడ్డి అన్నారు.కూసుమంచి మండలంలోని నాయకన్ గూడెంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు గొల్లపూడి వీరన్న నూతనంగా నిర్మించిన పివి ఫంక్షన్ హాల్ ను శుక్రవారం ఆయన రిబ్బను కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన ఫంక్షన్ హాల్ ను సందర్శించి,అన్ని రకాల వసతులతో ప్రజలకు సౌకర్యవంతంగా నిర్మించారని తెలిపారు.సాంస్కృతిక కార్యక్రమాలు,వివాహ శుభకార్యాలకు ఈ ఫంక్షన్ హాల్ ఎంతగానో దోహద పడుతుందని వెల్లడించారు.పరిసర గ్రామాల ప్రజలు పివి ఫంక్షన్ హాల్ ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.వీరన్న సూర్యకళ దంపతులు ఎంపీ రఘురాం రెడ్డిని శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.అనంతరం పాలేరు గ్రామంలోని బీవీ రెడ్డి ఫంక్షన్ హాల్ లో జరిగిన ఓ వివాహ వేడుకకి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కంచరి సైదమ్మ కొండల్,ఉప సర్పంచ్ భీష్మాచారి,మండల నాయకులు బజ్జూరి వెంకటరెడ్డి,కొమురెల్లి లింగారెడ్డి,మార్కెట్ కమిటీ డైరెక్టర్ కంచర్ల సుధీర్ రెడ్డి,నాయకులు కంచర్ల వీరారెడ్డి,కంచర్ల పవన్ రెడ్డి,మైనారిటీ నాయకులు ఎండి.జహంగీర్ షరీఫ్,తదితరులు పాల్గొన్నారు.

## రామారెడ్డి లో గ్రామసభ



**రామారెడ్డి రాజముద్ర న్యూస్** రామారెడ్డి మండలంలో శుక్రవారం రోజున గ్రామ సర్పంచి బండి ప్రవీణ్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు, గ్రామసభలో అన్ని సమస్యలపై విద్య, వైద్యం, మురికి కాలువలు, పారిశుభ్రత, వీధి దీపాలు, సక్రమంగా ఉంచాలని గ్రామస్తులు అడిగారు, వార్డు సభ్యులు తమ వార్డులో ఉన్న సమస్యలను గ్రామ సర్పంచ్ దృష్టికి తీసుకువచ్చి సాల్వ్ చేయాలని తెలిపారు, గ్రామ పంచాయతీ సెక్రెటరీ ప్రశాంత్ గ్రామంలోని ఖర్చులు, జమ, రూపాయలను సభలో చదివి వినిపించారు, గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి గ్రామస్తులందరూ సహకరించాలని గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు, ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, తాసిల్దార్,అన్ని శాఖల అధికారులు, ఉప సర్పంచ్, పాలకవర్గక సభ్యులు, అంగన్వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కామారెడ్డి శ్రీ చైతన్య పాఠశాలలో ఇంటో్స్ పరీక్ష ఫలితాలు



**కామారెడ్డి రాజముద్ర న్యూస్** కామారెడ్డి శ్రీ చైతన్య పాఠశాలలో ఇంటో్స్ పరీక్ష ఫలితాలు వెలువడడం జరిగింది.ఇందులో గ్రాండ్ ప్రైజ్ గా లెనోవా ల్యాప్టాప్ ను అమ్ముల అభిరాం గెలుచుకున్నాడు. గ్రాండ్ ప్రైజ్ గోల్డ్ మెడల్, మెరిట్ సర్టిఫికెట్ ఒకటి. రెండవ బహుమతి గోల్డ్ మెడల్, మెరిట్ సర్టిఫికెట్ ఒకటి. మూడవ బహుమతి గోల్డ్ మెడల్, మెరిట్ సర్టిఫికెట్ ఇద్దరు. నాలుగవ బహుమతి గోల్డ్ మెడల్, మెరిట్ సర్టిఫికెట్ ఇద్దరు. ఐదవ బహుమతి గోల్డ్ మెడల్, మెరిట్ సర్టిఫికెట్ నలుగురు. కన్సోలేషన్ బహుమతి గోల్డ్ మెడల్, మెరిట్ సర్టిఫికెట్ 57 మంది విద్యార్థులు, మెరిట్ సర్టిఫికెట్స్ 98 మంది విద్యార్థులు, స్పెషల్ ప్రైస్ గోల్డ్ మెడల్స్ 7, మొత్తం 173 బహుమతులు కామారెడ్డి శ్రీ చైతన్య విద్యార్థులు గెలుచుకున్నారు. ఈ కార్యక్రమాలలో పాఠశాల ప్రిన్సిపాల్ సంపత్ కుమార్ మాట్లాడుతూ మా పాఠశాల నుంచి 173 బహుమతులు గెలుచుకోవడం ఆనందంగా ఉందని వ్యక్తం చేశారు. అలాగే అమ్ములు అభిరామ్ లాప్టాప్ గెలుచుకోవడం కూడా మా పాఠశాలకు గర్వకారణంగా ఉందని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏ జిఎం రాజు, కోఆర్డినేటర్ మహిపాల్ రెడ్డి, ప్రిన్సిపల్ సంపత్ కుమార్,పాఠశాల డీన్ రాకేష్, సి బ్యాచ్ ఇంచార్జ్ స్వామి, మరియు ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు.

## కౌన్సిలర్ శ్రీనాథ్ రెడ్డి చొరవతో బోరు ఏర్పాటు



**ఖమ్మం, రాజముద్ర న్యూస్** ఏదులాపురం మున్సిపాలిటీ 32వ వార్డులోని స్మశాన వాటిక లోని సమస్యలపై ఆ కౌన్సిలర్ మామిండ్ల శ్రీనాథ్ రెడ్డి ఈనెల 17న కమిషనర్ మున్వర్ అలీకు వినతి పత్రాన్ని అందజేశారు.ఈ మేరకు స్పందించిన ఆయన మున్సిపాలిటీ నుంచి శుక్రవారం నూతన మంచి నీటి బోరును ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ మామిండ్ల శ్రీనాథ్ రెడ్డి కొబ్బరికాయ కొట్టి బోర్ ను ప్రారంభించారు.ప్రజా సమస్యల పరిష్కారంలో,వార్డు అభివృద్ధిలో రాజీ పడేది లేదని తెలిపారు.ఈ కార్యక్రమంలో 28వ వార్డు కౌన్సిలర్ దండి రంగారావు,సిపిఐ మున్సిపాలిటీ నాయకులు వెన్న భాస్కర్,మామిడి శంకర్ రెడ్డి, ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడు గణపరపు ఉపేందర్, యువజన సంఘం సభ్యులు ఏర్పుల లింగయ్య, మామిడాల కిరణ్, రెడ్డి బోయిన వెంకటేష్, దొంతగాని ఉపేందర్, మొగిలి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రేడ్ లైసెన్స్ లేకుండానే వ్యాపారాలు..

■ లక్షల్లో గ్రామపంచాయతీ ఆదాయానికి గండి






**భీమదేవరపల్లి, రాజముద్ర న్యూస్:** ట్రేడ్ లైసెన్స్ లేకుండానే కొందరు వ్యాపారాలు యదేచ్ఛగా నిర్వహిస్తున్నారు. ఏదేని దుకాణం నడపాలంటే తప్పనిసరిగా గ్రామపంచాయతీ కార్యాలయం నుంచి నిబంధనల మేరకు ఫీజు చెల్లించి ట్రేడ్ లైసెన్స్ రసీదు పొందాలి. భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ లో కొందరు దుకాణాదారులు, హోటళ్లు , మొబైల్ షాపులు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, చికెన్, మటన్ షాపులు, ట్రేడ్ లైసెన్స్ తీసుకోకుండానే వ్యాపారాలు చేస్తున్నారు. మరికొందరు ఏటా రెన్యువల్ చేసుకోకుండానే వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. దీంతో గ్రామపంచాయతీకి ఫీజుల రూపంలో రావలసిన ఆదాయానికి గండిపడుతోంది. ముల్కనూర్ గ్రామంలో 300 నుండి 400 దుకాణాలు ఉన్నట్లు గ్రామపంచాయతీ అధికారులు గుర్తించారు. అందులో కొందరు వ్యాపారులు మాత్రమే లైసెన్స్ తీసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. కొందరు ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారాలు సాగిస్తున్న గ్రామపంచాయతీ అధికారులు చర్యలు చేపట్టడంలో తాత్సర్యం చేస్తుండటం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ట్రేడ్ లైసెన్స్ జారీ రెన్యువల్ ఫీజుల వసూళ్ల పట్ల గట్టి చర్యలు చేపట్టి గ్రామపంచాయతీకి ఆదాయం నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత పంచాయతీ అధికారుల తో పాటు పాలకవర్గ ప్రజాప్రతినిధుల పైన ఎంతైనా ఉంది.

**చట్టపరమైన చర్యలు తీసుకుంటాం:**

జంగం పూర్ణచందర్‌పంచాయతీ కార్యదర్శి, ముల్కనూర్ ట్రేడ్ లైసెన్సులు తీసుకోని వ్యాపారులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. గ్రామంలో వ్యాపారాలు నిర్వహించే ప్రతి ఒక్కరు విధిగా ట్రేడ్ లైసెన్సులు తీసుకుని సహకరించాలి.

# అనాధ శవానికి గౌరవప్రదమైన అంత్యక్రియలు నిర్వహించిన ఎండీఆర్ ఫౌండేషన్.







**పటాన్ చెరువు, రాజముద్ర న్యూస్:-** పటాన్ చెరువు ప్రాంతంలో బిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్న ఓ వృద్ధురాలు మరణించగా, ఆమెకు ఎవరూ లేని పరిస్థితిలో మానవత్వంతో ముందుకొచ్చింది ఎండీఆర్ ఫౌండేషన్. సమాజం పక్కన పెట్టిన ఆ నిరాధార వృద్ధురాలికి గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించి తమ సేవాభావాన్ని చాటుకుంది.మరణం ముందు మనిషికి ఎంత బాధ ఉన్నా, చివరి ప్రయాణం గౌరవంగా జరగాలి అన్న భావంతో ఫౌండేషన్ సభ్యులు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసి సాంప్రదాయ ప్రకారం అంత్యక్రియలు పూర్తి చేశారు.ఇలాంటి సేవా కార్యక్రమాల ద్వారా ఎండీఆర్ ఫౌండేషన్ సమాజానికి ఒక ఆదర్శంగా నిలుస్తోంది. ఎవరూ లేని వారి కోసం నిలబడటం, వారి చివరి క్షణాల్లో అండగా ఉండటం నిజమైన మానవత్వం.మన చుట్టూ ఇలాంటి నిరాధారులు కనిపిస్తే వారికి సహాయం చేయడం మన సామాజిక బాధ్యత.మానవత్వమే మహత్తరమైన ధర్మం -- అదే ఎండీఆర్ ఫౌండేషన్ సందేశంఅంటూ ఒక ప్రకటన లో తెలిపారు.

# తిరుమలాయపాలెం మండల కేంద్రంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఘనంగా చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతి వేడుకలు



**ఖమ్మం, రాజముద్ర న్యూస్** భారత స్వాతంత్ర్య సంగ్రామం కొరకు విరోచితంగా పోరాడిన భారతీయ విప్లవ ఉద్యమకారుడు భగత్ సింగ్ రాజ్ గురు సుఖదేవ్ పండిత్ రామ్ ప్రసాద్ బిస్మిల్లా ఠాకూర్ రోషన్ సింగ్ ప్రేమ్ కిషన్ కన్నా అష్ఫకుల్ల ఖాన్ సహచరుడు చంద్రశేఖర్ ఆజాద్ 88వ వర్ధంతి వేడుకలను శుక్రవారం తిరుమలాయపాలెం మండల కేంద్రంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ సుబ్లేడ్ మాజీ సర్పంచ్ మందడి ఇజ్రాయిల్ ఆధ్వర్యంలో చంద్రశేఖర్ ఆజాద్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత స్వాతంత్ర ఉద్యమ పోరాటంలో భగత్ సింగ్ రాజగురు సుఖదేవ్ అనేకమంది ఉద్యమకారుల ను సమీకరించి రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన మహోన్నత వ్యక్తి ఆజాద్ చంద్రశేఖర్ అని ఆయన కొనియాడారు ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ గ్రామ మాజీ సర్పంచ్ మందడి ఇజ్రాయిల్ గోల్ తండా మాజీ సర్పంచ్ భాను తనిల్ కుమార్ జూపెడ మాజీ ఎంపీటీసీ నిమ్మల వెంకన్న చంద్రు తండా మాజీ సర్పంచ్ బోడ మంచనాయక్ టిఆర్ఎస్ మండల పార్టీ నాయకులు శ్రీరంగం సతీష్ కుమార్ కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు సామ శ్రీనివాస్ రెడ్డి టిడిపి మండల నాయకులు ఆలేటి రంగయ్య బానోత్ రమేష్ తూమాటి అజరయ్యా పదముత్తు కిరణ్ సిపిఎం మండల్ నాయకులు గోపోజి రవి ఎండి వలి ఎండి కరీం షేక్ యాకూబ్ అల్లా బక్షి సయ్యద్ మదర్ షేక్ సైదా షేక్ సిలార్ తదితరులు పాల్గొన్నారు

# వాహనం నడిపే సమయంలో క్రమశిక్షణ పాటించాలి

**- మన ప్రాణాలతో పాటు ఎదుటివారి ప్రాణాలు సురక్షితంగా ఉంటాయి**
**- వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా**





**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** తెలంగాణ రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు వికారాబాద్ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా రూపొందించిన అరైవ్--అలైవ్ కార్యక్రమాన్ని వికారాబాద్ జిల్లా పోలీసులు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిచారు. ఈ క్యాంపెయిన్ లో భాగంగా వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సత్యభారతి హాల్‌లో ప్రత్యేక కంటి వైద్య శిబిరం, అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి జాతీయ గీతాలాపనతో కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు నియమ నిబంధనలపై అవగాహన ఉన్నప్పటికీ వాహనదారులు ప్రదర్శించే చిన్నపాటి నిర్లక్ష్యం అనేక కుటుంబాల్లో తీరని విషాదాన్ని మిగులుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైవర్ల ప్రాణాలు మాత్రమే కాకుండా రోడ్డుపై ప్రయాణించే ఇతరుల ప్రాణాలు కూడా డ్రైవర్ల చేతుల్లోనే ఉంటాయని ఎస్పీ తెలిపారు. వాహనం నడిపే సమయంలో క్రమశిక్షణ పాటిస్తే మన ప్రాణాలతో పాటు ఎదుటివారిని కూడా సురక్షితంగా ఉంచగలమని పేర్కొన్నారు. ప్రమాదాల నివారణకు ప్రజల్లో మరింత చైతన్యం తీసుకురావడానికి క్షేత్రస్థాయిలో మరిన్ని అవగాహన సదస్సులు నిర్వహిస్తామని, అదే సమయంలో నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా కంటి చూపు లోపాలు ఉన్న డ్రైవర్లకు రాత్రి వేళల్లో ప్రమాద ముప్పు ఎక్కువగా ఉంటుందని ఎస్పీ సూచించారు. డ్రైవర్లందరూ క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించు కోవాలన్నారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న ఆటో, కార్, బస్సు, లారీ డ్రైవర్లు, విద్యార్థులు, యువతతో కలిసి ఆమె రహదారి భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ శిబిరంలో ప్రముఖ ఆసుపత్రుల సహకారంతో డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పాత్రికేయులకు హెల్మెట్ పంపిణీ చేశారు. ఈ అవగాహన కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ బి. రాములు నాయక్, వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, టౌన్ ఇన్‌స్పెక్టర్ రఘు కుమార్, పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అశోక్, సబ్ డివిజన్ ఎస్.ఐలు, డ్రైవర్ యూనియన్ సభ్యులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం  తెలుగు దిన పత్రిక
www.rajamudranews.com

# మావోయిస్టు రహిత రాష్ట్రంగా ఆవిర్భవించిన తెలంగాణ



తెలంగాణ ప్రాంతంలో విప్లవానికి ఊపిరి పోసిన రైతాంగ సాయుధ పోరాటం, నిజాం కాలం నాటి నుంచి మలి దశలో మావోయిస్టు ఉద్యమ విస్తరణ వరకు ఈ గడ్డపై తుపాకీ గొట్టం వినిపించని రోజు లేదు. కానీ కాలక్రమేణా మారుతున్న సామాజిక, రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణ నేడు మావోయిస్టు రహిత రాష్ట్రంగా ఆవిర్భవించింది. ఉమ్మడి రాష్ట్రంలో వెట్టిచాకిరి, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా మొదలైన సాయుధ రైతాంగ పోరాటం, ఈ గడ్డపై విప్లవ బీజాలుగా ఏర్పడింది. ఆ తర్వాత మరో దశకంలో కొండపల్లి సీతారామయ్య నేతృత్వంలోని పీపుల్స్ వార్ గ్రూప్ ఈ ప్రాంతాన్ని తన కంచుకోటగా మార్చుకుంది. ఉమ్మడి కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలు విప్లవ భావజాలానికి కేంద్ర బిందువులయ్యాయి. వేలాది మంది యువత అడవి బాట పట్టి, సాయుధ పోరాటమే సమస్యలకు పరిష్కారమని నమ్మారు. అప్పటి నుంచి తాజా పరిణామాల వరకు ఓసారి మావోయిస్టు ఉద్యమ చరిత్రను పరిశీలిద్దాం. అడవులు, కొండలను కంచుకోటగా మార్చుకుని : మావోయిస్టులు ఒకానొక దశలో ఉమ్మడి రాష్ట్రంలో పలు గ్రామాల్లో 'జనతన సర్కార్' పేరుతో సమాంతర ప్రభుత్వాలను నడిపారని గతంలోనే పోలీస్ అధికారులు గుర్తించారు. భూ పంపిణీ, గిరిజన సమస్యల పరిష్కారం లాంటి అంశాలతో ప్రజల్లో పట్టు సాధించారు. పోలీస్ నిఘా ఉన్నప్పటికీ, దట్టమైన అడవులు, కొండలు మావోయిస్టులకు రక్షణ కవచాలుగా మార్చుకున్నారు. దీంతో పోరాటంతోనే అన్ని రకాల సదుపాయాలు వస్తాయినే భావనను అదివాసులు, ప్రజల్లో మావోయిస్టు పార్టీ అగ్ర నేతలు కల్పించారు. మావోలు ప్రధానంగా భూ సంస్కరణలు, గిరిజన హక్కులు, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం, అడవుల్లో పోలీసుల కూంబింగ్ నిలిపివేత తదితర అంశాలపై అప్పటి వైఎస్సార్ ప్రభుత్వంలో చర్చలు జరిగాయి. మొదటి విడత చర్చలు జరిగాక, భూ సంస్కరణల వంటి అంశాలపై ఏకాభిప్రాయం కుదరకపోవడం, పరస్పర దాడుల నేపథ్యంలో ఈ చర్చలు విఫలమయ్యాయి. ఆపరేషన్ కగార్‌తో చెల్లాచెదురైన మావోలు : 2005 జనవరి నాటికి చర్చల ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయింది. మావోయిస్టులు తిరిగి అడవుల్లోకి వెళ్లిపోయారు. వైఎస్ఆర్ ప్రభుత్వం మావోయిస్టులపై మళ్లీ నిషేధాన్ని విధించింది. అదే సమయంలో కీలక నేతలు చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. గ్రేహౌండ్స్ దళాల గాలింపు చర్యలను తక్షణమే నిలిపివేయాలని కూడా కోరారు. 2014లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత, ప్రభుత్వం మావోయిస్టుల ప్రభావాన్ని తగ్గించడానికి రెండు పద్ధతులతో చర్యలను చేపట్టింది. ప్రపంచంలోనే అత్యుత్తమ అటవీ యుద్ధ తంత్రం తెలిసిన గ్రేహౌండ్స్ దళాలను బలోపేతం చేయడం ద్వారా మావోయిస్టుల షెల్టర్లను, రిక్రూట్‌మెంట్‌ను దెబ్బకొట్టారు. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సరిహద్దుల్లో బలమైన చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి రాకపోకలను అడ్డుకున్నారు. కేవలం బల ప్రయోగంతోనే కాకుండా, ప్రజల కనీస అవసరాలు తీర్చడం ద్వారా వారు మావోయిస్టులకు దూరం అవుతారని అధికారులు భావించారు. వర్గాలకు ఆర్థిక భరోసాను ప్రభుత్వం ఇచ్చింది. లోతట్టు గ్రామాలకు తారు రోడ్లు వేయడం ద్వారా గిరిజనులను ప్రధాన స్రవంతికి దగ్గర చేసింది. దీంతో పోలీసుల గస్తీ కూడా సులభమైంది. అలాగే కేంద్ర ప్రభుత్వం అపరేషన్ కగార్ పేరుతో మావోయిస్ట్ పార్టీని పూర్తిగా నిర్మూలించాలని భావించింది. వనం వీడి జనంలోకి : ప్రస్తుతం తెలంగాణలోని మెజారిటీ జిల్లాల్లో మావోయిస్టుల ఉనికి లేకుండా పోయింది. పునాదులు వేసిన నేతలే ఇప్పుడు ఆయుధాలు వదిలి జనజీవన స్రవంతిలోకి రావడం విశేషం. ఆ పార్టీ పొలిట్?బ్యూరో సభ్యుడు, సెంట్రల్ మిలిటరీ కమిషన్? ఇన్?ఛార్జి దేవ్?జీ, సెంట్రల్ కమిటీ సభ్యుడు రాజిరెడ్డి, రాష్ట్ర కమిటీ కార్యదర్శి బడే చొక్కారావు (దామోదర్), కీలక నేత నూనె నర్సింహా రెడ్డి లొంగిపోవడంతో రాష్ట్రంలో మావోయిస్టులకు దిశానిర్దేశం చేసే నాయకత్వం కనుమరుగైందని పోలీసులు చెబుతున్నారు.

# ఆ ఫ్లైఓవర్ నిర్మాణంతో ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారం




హైదరాబాద్, ఫిబ్రవరి 27 : బంజారాహిల్స్ రోడ్ నెంబర్-2లో పార్క్ హయత్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఫ్లై ఓవర్ నిర్మాణ పనులని మేఘా నిర్మాణ సంస్థ ప్రారంభించింది. ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు ప్రారంభమైన ప్రాంతాన్ని హైదరాబాద్ సీపీ సజ్జనార్ పరిశీలించారు. సీపీ సజ్జనార్‌తో పాటు ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ నిర్మాణ సంస్థ ప్రతినిధులు పరిశీలించారు. ఫ్లైఓవర్ నిర్మాణ పనులు ప్రారంభమైన సందర్భంగా (శుక్రవారం) నుంచి పలుమార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఈ సందర్భంగా సీపీ సజ్జనార్ మీడియాతో మాటాడారు. లో భాగంగా కేబీఆర్ పార్క్ చుట్టూ ఏడు ఫ్లైఓవర్లు, ఏడు అండర్ పాసుల నిర్మాణం జరుగుతోందని తెలిపారు. ఈ రోజు పనులు మొదలయ్యాయని పేర్కొన్నారు.నుంచి నిర్మాణ పనుల కారణంగా ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని సీపీ సజ్జనార్ చెప్పుకొచ్చారు. ఇప్పటికే వాహనదారులకు పలు సూచనలు చేశామని అన్నారు. రెండు సంవత్సరాల్లో నిర్మాణ పనులు పూర్తి చేయాలని ప్లాన్ చేశామని తెలిపారు. నిర్మాణ సమయంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా ప్లాన్ చేశామని చెప్పుకొచ్చారు. ఫ్లైఓవర్ నిర్మాణ సమయంలో ప్రజలు సహకరించాలని కోరారు. వివిధ ప్రాంతాల్లో నిర్మాణ పనులు దశల వారీగా జరుగుతాయని వెల్లడించారు. రాత్రి వేళ ఎక్కువగా పనులు చేయాలని నిర్మాణ సంస్థలను కోరామని అన్నారు. బేస్‌మెంట్ పూర్తి అయితే తర్వాత ట్రాఫిక్ ఆంక్షలు సవరించే అవకాశం ఉంటుందని తెలిపారు. 7 అండర్ పాసులు, 7 ఫ్లై ఓవర్లు అందుబాటులోకి వస్తే ఆయా రోడ్లు సిగ్నల్ ఫ్రీగా మారుతాయని హైదరాబాద్ సీపీ సజ్జనార్ పేర్కొన్నారు.అండర్ పాసుల నిర్మాణం ప్రారంభం: జోయల్ డేవిస్ భాగంగా నుంచి కేబీఆర్ పార్కు చుట్టూ 7 ఫ్లై ఓవర్లు, ఏడు అండర్ పాసుల నిర్మాణం ప్రారంభమైందని హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ తెలిపారు. ఈ సందర్భంగా జోయల్ డేవిస్ మాట్లాడారు. (శుక్రవారం) నుంచి ఈ పను లు మొదలయ్యాయని వివరించారు. నిర్మాణ పనులను దృష్టిలో ఉంచుకొని వాహనదారులకు ట్రాఫిక్ అడ్వైజరీ జారీ చేశామని అన్నారు.పంజాగుట్ట నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వైపు వెళ్లే వాహనాలు శ్రీనగర్ కాలనీ, ఇంద్రానగర్ బస్తీ మీదుగా జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వెళ్లాలని జోయల్ డేవిస్ సూచించారు. మాసబ్ ట్యాంక్ నుంచి కేబీఆర్ పార్కు మీదుగా జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వెళ్లే వాహనాలు రోడ్ నెంబర్- 45 మీదుగా వెళ్లాలని అన్నారు. రెండున్నర నెలలపాటు బంజారాహిల్స్ రోడ్ నెంబర్-2లో పిల్లర్స్ పనులు కొనసాగుతాయిని వివరించారు. రెండున్నర నెలలపాటు కొంత ట్రాఫిక్ సమస్య ఉంటుందని.. పరిస్థితులను బట్టి ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని వెల్లడించారు. పీక్ అవర్స్‌లో వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకో వాలని తెలిపారు. నిర్మాణ పనులు ప్రారంభమైనందున వాహన దారులు పోలీసులకు సహకరించాలని జోయల్ డేవిస్ కోరారు.

# కానిస్టేబుల్ సౌమ్య కుటుంబానికి ఎక్సైజ్ రిటైర్డ్ ఉద్యోగుల ఆసరా ఒకరోజు పెన్షన్ రూ. 2.80 లక్షల చెక్కు అందజేత



హైదరాబాద్, ఫిబ్రవరి 27 : విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య కుటుంబానికి ఎక్సైజ్ శాఖ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ అండగా నిలిచింది. అసోసియేషన్ సభ్యులు తమ ఒక రోజు పెన్షన్ మొత్తాన్ని విరాళంగా ప్రకటించారు. ఈ మేరకు రూ.2.80 లక్షల చెక్కును ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శుక్రవారం డా.బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో సౌమ్య కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కష్టకాలంలో ఉన్న ఒక సహోద్యోగి కుటుంబానికి విశ్రాంత ఉద్యోగులు తమ పెద్ద మనసుతో అండగా నిలవడం అభినందనీయమని కొనియాడారు. అంకితభావంతో పనిచేస్తూ ప్రాణాలు కోల్పోయిన సౌమ్య కుటుంబానికి ప్రభుత్వం ఇప్పటికే రూ. కోటి ఆర్థిక సాయంతో పాటు, ఆమె సోదరుడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించిందని గుర్తుచేశారు. మాదకద్రవ్యాల నియంత్రణలో ఎక్సైజ్ సిబ్బంది కృషిని ప్రభుత్వం గుర్తిస్తుందని, వారికి అన్నివేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో గంజాయి, అక్రమ మద్యంపై ఉక్కుపాదం మోపుతామని స్పష్టం చేశారు.వారంలోగా ఎక్సైజ్ బదిలీలుఎక్సైజ్ శాఖలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బదిలీల ప్రక్రియకు మోక్షం లభించనుందని మంత్రి జూపల్లి వెల్లడించారు. వారం రోజుల్లోగా సుమారు 2,500 మంది కానిస్టేబుళ్ల బదిలీలను పూర్తి చేస్తామని, అనంతరం ఇతర హోదాల్లోని అధికారుల బదిలీలను దశలవారీగా చేపడతామని వివరించారు.కుమ్మెర ఘటన బాధకరంనాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర మల్లికార్జున స్వామి జాతరలో చిన్నారి మృతి చెందడం పట్ల మంత్రి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు ప్రధాన నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారని, మిగిలిన వారి కోసం గాలిస్తున్నారని తెలిపారు.పర్యాటక రంగంలో నూతన ఒరవడితెలంగాణను దేశీ, విదేశీ పర్యాటకులకు కేరాఫ్ అడ్రస్‌గా మార్చేందుకు మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు మంత్రి తెలిపారు. నూతన పర్యాటక విధానం ద్వారా వాటర్ స్పోర్ట్స్, ఎకో, వెల్నెస్ టూరిజంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వెల్లడించారు. పర్యాటక ప్రాంతాలకు వెళ్లే రహదారుల వెంట పర్యాటకులకు సమాచారం అందించే సైన్ బోర్డులను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు ముకుంద రెడ్డి,, స్వరూప్ రెడ్డి, నిజామాబాద్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి, సౌమ్య కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు సౌందర్ రాజన్ కన్నుమూత 90 ఏళ్ల వయసులో మృతి



ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, హైదరాబాద్ నగర శివారులో ఉన్న చిలుకూరు బాలాజీ ఆలయానికి ప్రధాన అర్చకులుగా ఉన్న డాక్టర్ ఎంవీ సౌందరరాజన్ పరమపదించారు. అనారోగ్యం, వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న 90 ఏళ్ల సౌందరరాజన్.. ఇంట్లోనే చికిత్స పొందుతూ ఇవాళ ప్రాణాలు విడిచారు. సౌందరరాజన్.. దేవాలయాల స్వయం ప్రతిపత్తి కోసం పోరాటం చేశారు. అంతేకాకుండా హుండీ లేని ఆధ్యాత్మిక పాలన కావాలని.. ఏకంగా ప్రభుత్వాలను సైతం ఎదిరించి నిలబడ్డారు. చిలుకూరు బాలాజీ ఆలయాన్ని 'వీసా బాలాజీ'గా తీర్చిదిద్దడంలో ఆయన కృషి మరువలేనిది అని చెబుతారు. 90 ఏళ్ల వయసు ఉన్నప్పటికీ.. ఆలయ ధర్మం కోసం ఆయన అహర్నిషలు పరితపించేవారు. దేవుడు అంటే బిజినెస్ కావద్దని విశ్వసించే అరుదైన అర్చకుడైన సౌందరరాజన్.. ఆలయాలపై ప్రభుత్వ పెత్తనాన్ని ఎదిరించి.. 1998లో తన గుడిలో ఉన్న హుండీని తీసేసి వార్తల్లో నిలిచి సంచలనం సృష్టించారు. కేవలం వాక్ పత్రిక ద్వారా వచ్చే ఆదాయంతోనే.. ఆలయ నిర్వహణను చేస్తామని ప్రపంచానికి నిరూపించారు. భక్తుల జేబులో చెయ్యి పెట్టని దేవుడు అనే భావనను సౌందరరాజన్ బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంలో సఫలం అయ్యారు.డాక్టర్ ఎంవీ సౌందరరాజన్ కేవలం ఒక ఆధ్యాత్మిక వేత్త మాత్రమే కాదు.. గొప్ప విద్యావేత్త కూడా. ఉస్మానియా యూనివర్సిటీకి రిజిస్ట్రార్‌గా సౌందరరాజన్ సేవలు అందించారు. తనకు ఉన్న మేధస్సును ధర్మాన్ని రక్షించేందుకు ఆయన ఉపయోగించారు. ఆలయాల్లో వీఐపీ దర్శనాలకు వ్యతిరేకం అయిన సౌందరరాజన్.. పేద, ధనిక తేడా లేకుండా గుడికి వచ్చే అందరు భక్తులను ఒకే వరుసలో నిలబెట్టి.. దర్శనాలు కల్పించిన అరుదైన ఘనత ఆయన సొంతం. ఆలయానికి వచ్చే భక్తులు అందరికీ సమానంగా స్వామి వారి దర్శనం కల్పించే సంప్రదాయాన్ని ఆయన తీసుకు వచ్చారు.కళ్లు తెరిచి స్వామి వారిని చూడండి.. కళ్లు మూసుకుని కాదు అంటూ ఆయన మాట్లాడే మాటలకు ఎంతో మంది భక్తులచే ప్రశంసలు అందుకున్నారు. స్వామి వారిని నిదానంగా.. ప్రశాంతంగా చూడండి అని.. కళ్లారా స్వామిని చూసి.. తనివితీరా మొక్కండి అంటూ ఆయన మాట్లాడే మాటలు ఆలయంలో వినిపిస్తూనే ఉంటాయి.ఇక ఆలయ స్వయం ప్రతిపత్తి విషయంలో డాక్టర్ ఎంవీ సౌందరరాజన్ రాజీలేని పోరాటం చేశారు. 2006లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆలయాన్ని స్వాధీనం చేసుకోవాలని చూస్తే.. తాళాలు తీసుకెళ్లి ముఖ్యమంత్రికే ఇచ్చేస్తా అని ధైర్యంగా తేల్చి చెప్పారు. టెంపుల్ ప్రొటెక్షన్ మూవ్‌మెంట్ ద్వారా దేశవ్యాప్తంగా దేవాలయాల విముక్తి కోసం ఆయన నడుం బిగించారు.భౌతికంగా డాక్టర్ ఎంవీ సౌందరరాజన్.. అందరికీ దూరం అయినప్పటికీ.. చిలుకూరు బాలాజీ ఆలయంలో ఆయన నేర్పించినన 11 ప్రదక్షిణల సంకల్పం.. 108 ప్రదక్షిణల కృతజ్ఞత.. భక్తుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోనున్నాయి. ఇక ఆయన వారసుడు సీఎస్ రంగరాజన్.. ప్రస్తుతం తండ్రి సౌందరరాజన్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తున్నారు. ఒక నిబద్ధత గల అర్చకుడిగా, విద్యావేత్తగా, ధర్మకర్తగా సౌందరరాజన్ గారి పేరు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది.

# బాల్కసుమన్ బెయిల్ పిటిషన్‌పై వాదనలు మార్చి 2 కు వాయిదా



మంచిర్యాల : చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ బెయిల్ పిటిషన్ సోమవారానికి వాయిదా పడింది . మంచిర్యాల జిల్లా కోర్టులో బెయిల్ పిటిషన్‌పై శుక్రవారం మరోసారి వాదనలు జరిగాయి. కాంగ్రెస్ ప్రభుత్వం క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ పాలక వర్గం ఎన్నికల సమయంలో బాల్కసుమన్, బీఆర్ఎస్ నాయకులపై కేసులు విధించి జైలులో పెట్టారు.శుక్రవారం బాల్క సుమన్ కస్టడీ పిటిషన్‌ను మంచిర్యాల జిల్లా కోర్టు డిస్మిస్ చేసింది. బాల్క సుమన్‌ను కస్టడీలోకి తీసుకోవడానికి బలమైన ఆధారాలు లేవని న్యాయస్థానం అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో కస్టడీ పిటిషన్‌ను తిరస్కరించింది. అయితే బెయిల్ పిటిషన్‌పై సాయంత్రం కోర్టు విచారించి సోమవారానికి వాయిదా వేసింది.మంచిర్యాల జిల్లాలోని క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో బీఆర్ఎస్ , సీపీఐ సభ్యులు కలిసి అత్యధిక సంఖ్యల్లో కౌన్సిలర్లను గెలుచుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించవలసిన పాలకవర్గం ఎన్నికల్లో కాంగ్రెస్ కుట్ర పన్ని బీఆర్ఎస్ గెలుపొందకుండా అడ్డుకున్నారు.

# తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు గుడ్ న్యూస్.. రూ.745 కోట్ల పెండింగ్ బిల్లుల విడుదల!



హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు అందించింది. గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల ఆర్థిక బకాయిల విషయంలో డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క కీలక నిర్ణయం తీసుకున్నారు. శుక్రవారం నాడు ఆయన ఆదేశాల మేరకు ఆర్థిక శాఖ అధికారులు రూ.745 కోట్ల పెండింగ్ బిల్లులను విడుదల చేశారు. గతంలో ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపిన తర్వాత పెండింగ్ బిల్లులను విడతల వారీగా క్లియర్ చేస్తామన్న హామీని ప్రభుత్వం నిలబెట్టుకుంది.ప్రభుత్వం విడుదల చేసిన రూ.745 కోట్లతో ఉద్యోగులకు పెద్ద ఊరట లభించినట్లయింది. కేవలం ఉద్యోగులకే కాకుండా, గ్రామాల్లో అభివృద్ధి పనులు, పెండింగ్ బిల్లుల కోసం ప్రభుత్వం అదనంగా రూ389 కోట్లను ఆర్థిక శాఖ విడుదల చేసింది. ఈ నిధుల విడుదల ద్వారా గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న పనులు వేగవంతం కావడంతో పాటు, ఎంతోమంది ఉద్యోగుల ఆర్థిక ఇబ్బందులు తొలగిపోతాయని అంటున్నారు.

# సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీ, టీడీపీకి కోవర్టు :




హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 27: బీజేపీ, టీడీపీకి కోవార్టుగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అశాస్త్రీయమైన ఎస్సీ వర్గీకరణ చేసి మాలలను అణచివేసే కుట్రలు చేస్తున్నారని మాల సంఘాల జాక్ రాష్ట్ర చైర్మన్ మందాల భాస్కర్ మండిపడ్డారు. శుక్రవారం హనుమకొండలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ రోస్టర్ పాయింట్లు మూలంగా మాలలు విద్యా, ఉద్యోగ రంగాల్లో తీవ్రంగా నష్టపోతున్నారన్నారు.మాల సంఘాల విద్యార్థి జాక్ రాష్ట్ర చైర్మన్ మదాసి రాహుల్‌రావు మాట్లాడుతూ అశాస్త్రీయమైన ఎస్సీ వర్గీకరణ ద్వారా మాలలను అణచివేసే కుట్రలు చేసిన కాంగ్రెస్ పార్టీని భూస్థాపితం చేస్తామని హెచ్చరించారు. విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో మాలలకు రిజర్వేషన్లు తొలగించే కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. మాలలకు ద్రోహం చేసిన సీఎం రేవంత్‌రెడ్డిని ఏ పార్టీలో ఉన్న వెంటాడి ఒడిస్తామని వారు హెచ్చరించారు.మాల సంఘాల జాక్ గౌరవాధ్యక్షుడు చెరుకు రాంచందర్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి-చంద్రబాబు నాయుడు కనుసన్నల్లో నడుస్తూ మాలలకు అన్యాయం చేస్తే ఊరుకోబోమని, కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం సీఎం రేవంత్‌రెడ్డి పట్ల అప్రమత్తంగా ఉండి, ఎస్సీ వర్గీకరణ అంశాన్ని పునః పరిశీలించాలని లేకుంటే రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగ్గిన గుణపాఠం చెబుతామని వారు హెచ్చరించారు. సమావేశంలో నాయకులు బండి అశోక్, కంకణాల సంతోష్, దండు మోహన్, పానుగంటి లక్ష్మీనారాయణ, దండ్రి శ్రీనివాస్, గురిమిల్ల రాజు, శేషాద్రి, నాగులు, కునముల్ల అనిత, దావా రవి పాల్గొన్నారు.

# లంచాలు ఇవ్వలేదని రైస్ మిల్లర్ల అరెస్టులు




సూర్యాపేట, ఫిబ్రవరి 27 : నల్లగొండ జిల్లాలో మంత్రుల అవినీతి విశ్వరూపం బట్టబయలైందని, మున్సిపల్ ఎన్నికల్లో లంచాలు ఇవ్వలేదని రైస్ మిల్లర్లపైన పడి అరెస్టులు చేసి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. జిల్లా మంత్రులు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేస్తూ పరిపాలన చేస్తోందని దుయ్యబట్టారు. తిరుమలగిరిలో మున్సిపల్ చైర్మన్ బాధ్యతలు స్వీకరణ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి జగదీష్ రెడ్డి మాట్లాడారు. రైతులకు రైతు బంధు వేయకుండా రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. కేరళ ఎన్నికల కోసం తెలంగాణ నుండి డబ్బులు పంపాలని ప్రభుత్వం చూస్తోందన్నారు.భారతదేశంలోనే ఎక్కువ పంటను పండించి రికార్డు సృష్టించిన జిల్లా నల్లగొండ అన్నారు. పదేళ్లలో రైతులకు ఏ ఇబ్బంది రాకుండా కరోనా సమయంలో కూడా కేసీఆర్ రైతులను ఆదుకున్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ధాన్యం కొనుగోళ్లు చేయకుండా దళారులను, దోపిడిదారులకు కొమ్ముకాస్తున్నట్లు తెలిపారు. రైతుబంధు డబ్బులను ఎగ్గాడుతూ దేవుళ్ల మీద ఒట్లు పెట్టి పబ్బం గడుపుతున్న వ్యక్తి రేవంత్ రెడ్డి అన్నారు.

# నేడు అదనపు ఎస్సై రామలింగారెడ్డి పదవీ విరమణ

## - అభినందనలు తెలిపిన ఎస్సై కూచిపూడి జగదీష్

ఖమ్మం, రాజముద్ర న్యూస్.




పోలీస్ శాఖలో సుదీర్ఘంగా 41 సంవత్సరాల పాటు సేవలు అందించిన తిరుమలాయపాలెం అదనపు ఎస్సై మరెడ్డి రామలింగారెడ్డి శనివారం పదవీ విరమణ చేయనున్నారు.విధి నిర్వహణలో భాగంగా పలు ఫిర్యాదులు,సమస్యల పై పోలీస్ స్టేషన్ కి వచ్చే బాధిత ప్రజలతో స్నేహపూ ర్వకంగా వ్యవహరించి వాటి పరిష్కారానికి ఆయన అవిరాళంగా కృషి చేశారు.పోలీస్ శాఖలో వివిధ హోదాల్లో,పలు ప్రాంతాల్లో పని చేసిన ఆయన నిబద్ధత,సిన్సియారిటి కలిగిన పోలీస్ అధికారిగా ప్రజల మన్ననలు,అభిమానం పొందారు.ఈ సందర్భంగా ఎస్సై కూచిపూడి జగదీష్,పోలీస్ సిబ్బంది రామలింగారెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు.పోలీస్ శాఖలో మచ్చలేని వ్యక్తిగా,గౌరవ ప్రదంగా పదవీ విరమణ చేయడం అభినందనీయం అని కొనియాడారు.శేష జీవితం అంతా కుటుంబ సభ్యులతో కలిసి సంతోషమయంగా,ఆరోగ్యంగా జీవించాలని అభిలాషించారు.

# వైవీ సుబ్బారెడ్డిని జైల్లో వేస్తే సంతోషించే మొదటి వ్యక్తిని నేనే



**ప్రకాశం, ఫిబ్రవరి 27:** వైసీపీ నేత వైవీ సుబ్బారెడ్డిపై మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి హాట్ కామెంట్స్ చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. తిరుమల లడ్డూలో వైవీ సుబ్బారెడ్డి ఎంత సంపాదించుకున్నారో తనకు తెలియదని.. మిగతా విషయాల్లో చాలా సంపాదించుకున్నారని తెలిపారు. సుబ్బారెడ్డిని జైల్లో వేస్తే సంతోషించే మొదటి వ్యక్తి తానే అని శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు. ఒంగోలు నియోజకవర్గంలో తాను ఏడుసార్లు పోటీ చేసి.. రెండుసార్లు ఓడిపోయానని బాలినేని తెలిపారు. ఆ రెండు సార్లూ కూటమి బలంగా ఉండటం వల్లే ఓటమి పాలయ్యానని ఆయన వివరించారు. ఎన్నికల తర్వాత తాను జనసేనలో చేరానని తెలిపారు. కూటమి పార్టీలో ఉన్న తనపై పలు ఆరోపణలు చేశారని ఆయన అన్నారు. తనపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరపాలని సీఎం చంద్రబాబును కోరానని శ్రీనివాసరెడ్డి తెలిపారు. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో డ్వాక్రా గ్రూపుల్లో నగదు కాజేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. వైసీపీలో డ్వాక్రా మహిళల నగదు కాజేసిన వారి పేర్లు బయటపెట్టాలని శ్రీనివాసరెడ్డి కోరారు. తన కొడుకుపై అసత్య ఆరోపణలు చేసి తనను మానసిక క్షోభకు గురి చేస్తున్నారని మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు.

# బొత్సకు అస్వస్థత.. హైదరాబాద్‌కు తరలింపు




**అమరావతి, ఫిబ్రవరి 27:** వైసీపీ ఎమ్మెల్సీ, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ అస్వస్థతకు గురయ్యారు. (గురువారం) రాత్రి ఆయన అస్వస్థతకు గురవడంతో కుటుంబ సభ్యులు వెంటనే హైదరాబాద్‌కు తరలించారు. హైదరాబాద్‌లోని సిటీ న్యూరో ఆసుపత్రిలో బొత్స సత్యనారాయణ చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం బొత్స ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.
బొత్స స్పందన..తన ఆరోగ్యంపై మీడియాలో వస్తున్న వార్తలపై బొత్స సత్యనారాయణ స్పందించారు. 'నా ఆరోగ్యంపై ఆందోళన అనవసరం. నేను ఆరోగ్యంగానే ఉన్నాను. రొటీన్ చెకప్‌లో భాగంగా ఆస్పత్రికి వచ్చాను' అంటూ మాజీ మంత్రి స్పష్టం చేశారు.

# 10 సెకన్లలోనే మండలిని వాయిదా వేసిన ఛైర్మన్



**అమరావతి, ఫిబ్రవరి 27:** వాయిదా అనంతరం తిరిగి మొదలైన ఏపీ శాసనమండలి కేవలం పది సెకన్లలోనే మరోసారి వాయిదా పడింది. ఈరోజు ఉదయం సభ మొదలైన వెంటనే వైసీపీ ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజు తిరస్కరించారు. దీంతో ఛైర్మన్ పోడియం వద్ద వైసీపీ సభ్యులు నిరసనకు దిగారు. అలాగే, తిరుమల లడ్డూ ప్రసాదంపై నిన్న జరిగిన లఘు చర్చలో తప్పుడు పత్రం ఇచ్చారంటూ ఛైర్మన్ ప్రకటన చేశారు. దీనిపై మంత్రి అచ్చెన్నాయుడు అభ్యంతరం తెలిపారు. ఛైర్మన్ అంటే తమకు అపారమైన గౌరవం ఉందన్నారు. నెయ్యి అంశంపై ఎన్ని రోజులైనా చర్చించడానికి సిద్ధంగా ఉన్నామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. సభలో వైసీపీ సభ్యుల ఆందోళనతో గందరగోళం నెలకొనడంతో ఛైర్మన్ సభను వాయిదా వేశారు. కొద్దిసేపటి తర్వాత శాసనమండలి తిరిగి మొదలైంది. మండలి ప్రారంభమవుతుందని సిబ్బంది బెల్ కొట్టగానే ఛైర్మన్ వచ్చి.. సభను వచ్చే నెల 4వ తేదీకి వాయిదా వేస్తున్నట్టు ప్రకటించి, నమస్కారం చెప్పి వెళ్లిపోయారు. దీంతో టీడీపీ సభ్యులు తమ స్థానాల్లో కూర్చుని నిరసన తెలిపారు. మండలిలోకి వెళ్లి తమ స్థానాల్లో కూర్చున్న మంత్రులు, టీడీపీ, జనసేన, బీజేపీ ఎమ్మెల్సీలు.. తాము చర్చకు సిద్ధమని స్పష్టం చేశారు. ఇప్పటికే రూల్ 307 కింద తిరుమల లడ్డూపై స్టేట్‌మెంట్ ఇవ్వడానికి సిద్ధమని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి నోటీసు ఇచ్చారు.

# ఏపీ కొత్త సీఎస్‌గా సాయిప్రసాద్.. బాధ్యతల స్వీకరణ




**అమరావతి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(జూ)గా సీనియర్ ఐఏఎస్ అధికారి జి.సాయి ప్రసాద్ పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుత సీఎస్ కె.విజయానంద్ పదవీ కాలం ఫిబ్రవరి 28, 2026 నాటితో ముగియనుంది. ఆయన స్థానంలో సాయి ప్రసాద్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఇప్పటికే అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. శనివారం ఉదయం ఆయన ఏపీ సచివాలయంలో నూతన సీఎస్‌గా పదవీ బాధ్యతలు చేపడతారు. 1991 ఐఏఎస్ బ్యాచ్ ఏపీ క్యాడర్‌కు చెందిన జి.సాయి ప్రసాద్ ఎంటెక్ పూర్తిచేశారు. 1991 ఐఏఎస్‌కు ఎంపికై 1992 నుంచి 1993 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వరంగల్ అసిస్టెంట్ కలెక్టర్‌గా పనిచేశారు. అనంతరం 1993 నుంచి 1995 వరకు పాడేరు అసిస్టెంట్ కలెక్టర్‌గా పనిచేశారు. 1995 నుంచి 1997 వరకు గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా విధులు నిర్వహించారు. 1997 నుంచి 1998 వరకు కడప జాయింట్ కలెక్టర్‌గా పనిచేశారు. 2000 నుంచి 2003 వరకూ కర్నూల్ జిల్లా కలెక్టర్‌గా పనిచేశారు. 2010 నుంచి 2011 వరకు ఏపీ హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్‌గా విధులు నిర్వహించారు. 2024 జూన్ నుంచి 2025 జనవరి వరకు జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న సాయి ప్రసాద్ రేపు (శనివారం) నూతన సీఎస్‌గా పదవీ బాధ్యతలు చేపట్టబోతున్నారు.

# వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 943 రకాల సేవలు: మంత్రి లోకేశ్



**అమరావతి, ఫిబ్రవరి 27:** ఏపీ శాసనసభలో మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ సేవలపై ఎమ్మెల్యే వాల్మీకి పార్థసారథి అడిగిన ప్రశ్నకు మంత్రి నారా లోకేశ్ సమాధానమిచ్చారు. ప్రస్తుతం 943 రకాల సేవలను వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అందిస్తున్నామని మంత్రి తెలిపారు. ఇప్పటి వరకు కోటి 40 లక్షల మంది ప్రజలు ఈ సేవలను పొందారని వివరించారు. వాట్సాప్ గవర్నెన్స్‌కు కృత్రిమ మేధస్సును జోడించి యూజర్ ఫ్రెండ్లీగా మార్చామని చెప్పారు. ఉన్న సౌకర్యాలను ప్రజల అవసరాలకు అనుగుణంగా వినియోగించుకునేలా చేశామని తెలిపారు. ఈ వ్యవస్థను మరింత ఆధునీకరించాలని ప్రభుత్వం భావిస్తోందని చెప్పారు. వేగంగా స్పందించడం, రసీదులు తక్షణమే అందించడం వంటి అంశాలపై దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. సభ్యులు క్షేత్రస్థాయి పరిస్థితులపై ఫీడ్‌బ్యాక్ ఇవ్వాలన్నారు. మనమిత్ర 2.0ను త్వరలో ప్రారంభించాలని ప్రభుత్వం ఆలోచిస్తోందని మంత్రి లోకేశ్ సభలో వెల్లడించారు. చేనేత కార్మికుల సంక్షేమంపై..చేనేత కార్మికుల సంక్షేమంపై అమలాపురం ఎమ్మెల్యే ఆనందరావు ప్రశ్న లేవనెత్తగా.. మంత్రి సవిత సమాధానమిచ్చారు. వ్యవసాయం తర్వాత అత్యధిక మంది చేనేత రంగంపై ఆధారపడ్డారని తెలిపారు. చేనేత కార్మికులకు సంక్షేమ పథకాలతో పాటు అండగా నిలుస్తున్నామని చెప్పారు. వైసీపీ హయాంలో చేనేత సంక్షేమ పథకాలు రద్దు చేశారని.. థ్రిఫ్ట్ నిధులను నిలిపివేశారని ఆరోపించారు. ప్రస్తుతం 50 ఏళ్లు దాటిన చేనేత కార్మికులందరికీ నెలకు రూ.4 వేల పెన్షన్ అందిస్తున్నామని తెలిపారు. 93 వేల మంది చేనేత కార్మికులు ఈ పెన్షన్ పొందుతున్నారని మంత్రి వివరించారు. ఏప్రిల్ నుంచి పవర్ లూం, హ్యాండ్ లూంలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని మంత్రి తెలిపారు. వడ్డీ భారం తగ్గించేందుకు పావలా వడ్డీకే రుణాలు అందిస్తున్నామన్నారు. ముడి సరుకు సరఫరాపై 15 శాతం రాయితీ ఇస్తున్నామని, ఒక జిల్లా ఒక ఉత్పత్తి కింద చేనేతలకు 10 అవార్డులు వచ్చాయని చెప్పారు. వైసీపీ హయాంలో కేంద్రం నుంచి ఆప్కో పేరిట రూ.120 కోట్లు తెచ్చి దారి మళ్లించారని, దీనివల్ల చేనేత కార్మికులు ఇబ్బంది పడ్డారని మంత్రి సవిత సభలో తెలియజేశారు.

# నెయ్యి అంశంపై ఎన్ని రోజులైనా చర్చకు సిద్ధం



**అమరావతి, ఫిబ్రవరి 27:** ఏపీ శాసనమండలిలో మరోసారి గందరగోళ పరిస్థితి నెలకొంది. వైసీపీ ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజు తిరస్కరించడంతో ఆ పార్టీ సభ్యులు ఆందోళనకు దిగారు. దీంతో ఛైర్మన్ సభను వాయిదా వేశారు. (శుక్రవారం) ఉదయం మొదలైన వెంటనే (గురువారం) జరిగిన సంఘటనపై ఛైర్మన్ రూలింగ్ ఇచ్చారు. 'నిన్న లడ్డూ ప్రసాదంపై లఘు చర్చ సందర్భంగా తప్పుడు పత్రం చూపించి తప్పుదారి పట్టించే ప్రయత్నం చేశారు. ఇరుపక్షాలు సభ సజావుగా జరిగేలా సహకరించాలి' ఛైర్మన్ అన్నారు. ఛైర్మన్ రూలింగ్‌పై మంత్రి అచ్చెన్నాయుడు అభ్యంతరం తెలుపగా.. మరింత మాట్లాడి తనను ఇన్సల్ట్ చేయాలనుకుంటున్నారా అని ఛైర్మన్ ప్రశ్నించారు. దీనిపై స్పందించిన మంత్రి.. 'మాకు మీరంటే అపారమైన గౌరవం ఉంది' అని స్పష్టం చేశారు. రెండు రోజుల క్రితం అసెంబ్లీలో జరిగిన చర్చ సందర్భంగా ప్రతిపక్షం లేకపోవడంతో తమ సభ్యుడు ధూళిపాళ్ల నరేంద్రతో నోటీసులు ఇప్పించి.. మంత్రి స్టేట్‌మెంట్ ఇచ్చిన సంఘటనను అచ్చెన్నాయుడు గుర్తు చేశారు. మార్చి 4వ తేదీన కాకపోతే వరుసగా మూడు రోజులు చర్చకు తాము సిద్ధమని మంత్రి ప్రకటించారు. ప్రతిపక్షం చర్చ చేపట్టాలని చెప్పి పారిపోవడం ఏమిటని ప్రశ్నించిన అచ్చెన్నాయుడు.. 'ఇంతటి అసమర్థ ప్రతిపక్షాన్ని నేను ఎక్కడా చూడలేదు' అని వ్యాఖ్యానించారు. నెయ్యి అంశంపై ఎన్ని రోజులైనా చర్చించడానికి తాము సిద్ధమని కూడా మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. వైసీపీ సభ్యులు ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని ఛైర్మన్ తిరస్కరించడంతో.. ఆ పార్టీ సభ్యులు పోడియం వద్దకు వచ్చి నిరసన తెలిపారు. ఇలా ఛైర్మన్ పోడియం వద్దకు వచ్చి నిరసన తెలపడం ఏంటని మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రశ్నించారు. 'ఛైర్మన్‌కు గౌరవం ఇవ్వటం ఇదేనా' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ సభ్యుల నిరసనతో సభలో గందరగోళం నెలకొనడంతో ఛైర్మన్ సభను వాయిదా వేశారు.

# త్వరలోనే పోలవరం ఎడమ కాలువ పనులు పూర్తి




**అమరావతి, ఫిబ్రవరి 27:** ఏపీ అసెంబ్లీలో ప్రశ్నోత్తరాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్ట్‌పై అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ప్రశ్నకు మంత్రి నిమ్మల రామానాయుడు సమాధానం ఇచ్చారు. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఈ ప్రాజెక్ట్ పనులు ప్రారంభించినట్టు తెలిపారు. 8 లక్షల ఎకరాలకు సాగునీరు, 30 లక్షల మందికి తాగునీరు, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు నీరు సరఫరా చేయడమే లక్ష్యమని వివరించారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా నీరు అందించాలనే ఆలోచనతో ప్రాజెక్ట్ ముందుకు సాగుతోందని మంత్రి చెప్పారు. ప్రస్తుత బడ్జెట్‌లో పేజ్-1, పేజ్-2 పనుల కోసం రూ.600 కోట్లు కేటాయించామని తెలిపారు. ఉత్తరాంధ్రలోని మిగతా ప్రాజెక్టులకు కూడా నిధులు కేటాయించామని తెలిపారు. వైసీపీ పాలనలో పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులకు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని ఆరోపించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.1,200 కోట్లు ఖర్చు చేసినట్టు వెల్లడించారు. ఈ ఏడాదిలోనే ఎడమ కాలువ పనులను పూర్తి చేస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. రమణయ్యపేట ఛానల్ ఆక్రమణలపై..రమణయ్యపేట ఛానల్ ఆక్రమణలపై ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు అడిగిన ప్రశ్నకు కూడా మంత్రి నిమ్మల రామానాయుడు సమాధానం ఇచ్చారు. రమణయ్యపేట కాలువ ఆక్రమణలు కాకినాడ రూరల్ మండలం గుండా వెళ్తున్నట్టు తెలిపారు. ఇరిగేషన్, రెవెన్యూ శాఖ లు ఉమ్మడి సర్వే నిర్వహిస్తున్నాయని, ఇప్పటి వరకు 84 ఆక్రమ ణలు జరిగాయని గుర్తించినట్లు చెప్పారు. రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు సమన్వయం చేసుకుని ఆక్రమణలను గుర్తించి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కొన్ని చోట్ల ఇరిగేషన్ భూమిని ఇళ్ల స్థలాలుగా మార్చాలని కోరుతున్నారన్నారు. అలా చేయడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. డ్రైనేజీ వ్యవస్థను ప్రక్షాళన చేయ డంపై దృష్టి సారించామని మంత్రి తెలిపారు. రాజమ హేంద్రవరం రూరల్ ప్రాంతంలో డ్రైనేజీ వ్యవస్థ, ఇరిగేషన్ కెనాల్‌లను మున్సిపాలిటీకి అప్పగించాలా, ఇరిగేషన్ చేయాలా అనే అంశంపై సందిగ్ధం నెలకొందని, దీనిపై సమీక్ష చేసి తగిన తీసుకుంటామని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.

# జగన్ హయాంలో వ్యవసాయ రంగం తీవ్రంగా నష్టపోయింది



**అమరావతి, ఫిబ్రవరి 27 :** జగన్ హయాంలో వ్యవసాయ రంగం తీవ్రంగా నష్టపోయిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆరోపణలు చేశారు. వ్యవసాయంలో జాతీయ జీడీపీలో ఏపీకి పదిశాతం వాటా ఉందని ప్రస్తావించారు. (శుక్రవారం) వ్యవసాయ రంగం బడ్జెట్‌పై అసెంబ్లీలో ముఖ్యమంత్రి మాట్లాడారు. పంచసూత్రాలు, అగ్రిటెక్ ద్వారా వ్యవసాయ అభివృద్ధికి చర్యలు చేపట్టామని తెలిపారు. డిమాండ్ ఉన్న పంటలను పండించేలా రైతులకు అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగాన్ని ప్రోత్సహిస్తాం..ఫుడ్ ప్రాసెసింగ్ రంగాన్ని ప్రోత్సహించటం ద్వారా పంటలకు మంచి ధర లభిస్తుందని సీఎం చంద్రబాబు వివరించారు. ప్రతి ఏడాది రూ.13,722కోట్లను వ్యవసాయంలో ఉచిత విద్యుత్‌కు ఇస్తున్నామని చెప్పుకొచ్చారు. భూసారం పెంచేందుకు సూక్ష్మ పోషకాలను రైతన్నలకు పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. వైసీపీ హయాంలో అన్నదాత సుఖీభవం కింద రూ.7వేలు ఇస్తే... కూటమి ప్రభుత్వంలో రూ.14వేలు ఇస్తున్నామని స్పష్టం చేశారు. రైతు భరోసా పేరు చెప్పి జగన్ హయాంలో ప్రభుత్వం నుంచి వచ్చే మిగతా ప్రోత్సాహకాలూ కూడా ఆపివేసిందని ఆగ్రహించారు. ధాన్యం కొనుగోళ్లకు రూ.10వేల కోట్లకు పైగా అన్నదాతలకు ఇచ్చామని చెప్పుకొచ్చారు. రూ.1,670 కోట్ల ధాన్యం బకాయిలు తాము చెల్లించామని స్పష్టం చేశారు. రైతన్నలు ఆత్మహత్యలు చేసుకోకుండా చర్యలు..రైతన్నలు ఆత్మహత్యలు చేసుకోకుండా చర్యలు చేపట్టామని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. అన్నదాతల ఆత్మహత్యకు గల కారణాలు తెలుసుకుని సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు. వ్యవసాయ యాంత్రీకరణకు పెద్దపీట వేస్తున్నామని అన్నారు. కృత్రిమ మేధ వంటి ఆధునిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామని వివరించారు. కృత్రిమ మేధ అందించే వ్యవసాయ శాస్త్రవేత్తలను రైతుల కోసం నియమి స్తామని తెలిపారు. 8వేలకు పైగా గ్రామాల్లో 15లక్షల మంది రైతన్నలు ప్రకృతి సేద్యం చేస్తున్నారని చెప్పుకొచ్చారు. 40లక్షల మంది అన్నదాతలను ప్రకృతి సేద్యం వైపు మళ్లించాలనేది తమ ప్రభుత్వ లక్ష్యమని వ్యాఖ్యానించారు. హార్టికల్చ ఇర్ హబ్ అభివృద్ధి చేస్తాం..రాయలసీమ ఉద్యాన పంట ఇలకు కేంద్రంగా ఉందని సీఎం చంద్రబాబు తెలిపారు. ప్రస్తుతం ఉన్న 20లక్షల హెక్టార్లనూ.. 40లక్షల హెక్టార్లకు పెంచుతామని వివరించారు. ఉద్యాన పంటల దిగుబడులను 400మిలియన్ మెట్రిక్ టన్నుల నుంచి 1000 మిలియన్ మెట్రిక్ టన్నులకు పెంచుతామని తెలిపారు. రూ.30వేల కోట్లతో ప్రత్యేక ప్రాజెక్టు ప్రారంభిస్తామని చెప్పుకొచ్చారు. మౌలిక వసతుల కోసం రూ.70వేల కోట్లు ఖర్చు చేస్తామని, లక్ష కోట్ల రూపాయలతో హార్టికల్చర్ హబ్ అభివృద్ధి చేస్తామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# జగన్ హయాంలో పరిశ్రమలు ఏపీ నుంచి వెళ్లిపోయాయి.. మంత్రి టీజీ భరత్ ధ్వజం



అమరావతి, ఫిబ్రవరి 27 : జగన్ హయాంలో 913 కంపెనీలు ఏపీ నుంచి వెళ్లిపోయాయని ఏపీ మంత్రి టీజీ భరత్ తెలిపారు. జగన్ హయాంలో పారిశ్రామిక ప్రగతి ఎలా ఉందో ఆర్బీఐ నివేదిక ద్వారా అర్థమవుతోందని పేర్కొన్నారు. 2019 నుంచి 2020 సంవత్సరంలో ఏపీలో 16,924 పరిశ్రమలు ఉంటే, 2023 నుంచి 2024కు వచ్చే సరికి 16,011 పరిశ్రమలు ఉన్నాయని ప్రస్తావించారు. శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మంత్రి టీజీ భరత్ మాట్లాడారు. పారిశ్రామికవేత్తలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు..గుజరాత్, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల్లో ప్రతి ఏడాది కూడా పరిశ్రమలు పెరిగాయని మంత్రి టీజీ భరత్ వివరించారు. జగన్ హయాంలో ఏపీలో పారిశ్రామికవేత్తలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని చెప్పుకొచ్చారు. వైసీపీ హయాంలో పారిశ్రామికదారులు ఏపీ నుంచి వెళ్లిపోతే.. జగన్ అండ్ కో మాత్రం ఎన్నో పరిశ్రమలు రాష్ట్రానికి తీసుకొచ్చామని గొప్పలు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. తమ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఏపీ పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందుతోందని వ్యాఖ్యానించారు. 20 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం. 20 లక్షల కోట్ల పెట్టుబడులకు క్యాబినెట్ భేటీ ద్వారా తాము ఆమోదించామని మంత్రి టీజీ భరత్ ప్రస్తావిం చారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే తమ లక్ష్యంగా పనిచేస్తున్నామని వివరించారు. చంద్రబాబు బ్రాండ్ చూసి ఏపీకి పెట్టుబడులు క్యూ కడుతున్నాయని ఉద్ఘాటించారు. తొమ్మిది నెలల్లో దేశంలో వచ్చిన పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకి పెట్టుబ డులు వచ్చాయని వెల్లడించారు. ఆ తర్వాతి స్థానంలో ఉన్న రాష్ట్రాలు మనకంటే చాలా తక్కువగానే పెట్టుబడులు ఆకర్షిం చాయని పేర్కొన్నారు. వైసీపీ నేతల మాయమాటలని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని మంత్రి టీజీ భరత్ విమర్శించారు.

# రసవత్తరంగా తమిళ రాజకీయాలు- డీఎంకేలో చేరిన జయ నమ్మినబంటు పన్నీర్‌సెల్వం

**చెన్నై :** తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. దివంగత సీఎం జయలలితకు అత్యంత నమ్మకస్తుడిగా గుర్తింపు పొందిన, మూడు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన ఓ.పన్నీ ర్‌సెల్వం (ఓపీఎస్) ఇప్పుడు ప్రత్యర్థి పార్టీలో చేరారు. అధికార ద్రవిడ మున్నేట్ర కళగం (డీఎంకే)లో ఆయన శుక్రవారం అధికా రికంగా చేరడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ సమక్షంలో చెన్నైలో జరి గిన కార్యక్రమంలో ఓపీఎస్‌కు పార్టీ కండువా కప్పి స్వాగతం పలికారు.అన్నాడీఎంకేలో కీలక పదవులు నిర్వహించిన పన్నీర్ సెల్వం, 2022లో పార్టీ అంతర్గత అధికార పోరాటం తర్వాత బహిష్కరణకు గురయ్యారు. ఆ తర్వాత మళ్లీ తన మాతృపార్టీలోకి చేరేందుకు ఆయన చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దాంతో చివరకు రాజకీయ భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని డీఎంకేలో చేరినట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు తన కుమారుడు పి. రవీంద్రనాథ్ కుమార్, అనుచరులు కూడా డీఎంకేలో చేరడం విశేషం.స్టాలిన్ ఆదేశాల మేరకు పని చేస్తానని స్పష్టం డీఎంకేలో చేరిన అనంతరం మీడియాతో మాట్లాడిన ఓపీఎస్, అన్నాడీఎంకే అధినేత ఎడప్పాడి కె. పళనిస్వామిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. "పార్టీకి భవి ష్యత్‌లో ఎలాంటి విజయం దక్కకుండా చేసే పరిస్థితిని పళని స్వామి సృష్టించారు. ఆయన నిరంకుశుడు, అహంకారి. పార్టీ అంతర్గత ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా నాశనం చేశారు" అంటూ మండిపడ్డారు. గతంలో తనకు జరిగిన విషయాల గురించి ఇప్పుడు ఆలోచించడం లేదని, ఇకపై సీఎం స్టాలిన్ ఆదేశాల మేరకు పని చేస్తానని స్పష్టం



చేశారు.స్టాలిన్ నాయకత్వంపై ప్రశంసలు కురిపించిన ఓపీఎస్, "ప్రజల అవసరాలు అర్థం చేసుకుని సంక్షేమ పథకాలు అంది స్తున్న నాయకుడు స్టాలిన్. అందరికీ సమానంగా పాలన అంది స్తున్నారు. రాష్ట్ర అభివృద్ధి, ద్రవిడ సిద్ధాంతాల పరిరక్షణ కోసం డీఎంకే కట్టుబడి ఉంది" అని అన్నారు. ఇకపై తాను కూడా సాధారణ కార్యకర్తగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలి పారు. ఇక అసెంబ్లీలో కూడా ఈ రాజకీయ మార్పు ప్రభావం కనిపించింది.ఓపీఎస్ వర్గానికి చెందిన ఎమ్మెల్యే పి. అయ్యప్పన్, స్టాలిన్ మళ్లీ ముఖ్యమంత్రిగా రావాలని కోరుకుంటూ ప్రసంగించారు. ముఖ్యంగా పాఠశాల పిల్లల కోసం అమలు చేస్తున్న బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రశంసిస్తూ, "తల్లిలా పిల్లలకు ఆహారం అందించే ప్రభుత్వం ఇది" అని వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో డీఎంకేనే మళ్లీ గెలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. అయితే ఈ పరిణామంపై ప్రతిపక్ష నేతలు విమర్శలు చేస్తున్నారు. ముఖ్యంగా ఎన్‌డీఏ మిత్రపక్షమైన అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం ప్రధాన కార్యదర్శి టీటీవీ ధినకరన్ స్పందిస్తూ, "ఓపీఎస్‌కు తనకు నచ్చిన కూటమిలో చేరే హక్కు ఉంది. కానీ జయలలితా వారసత్వాన్ని ఈ నిర్ణయానికి కారణంగా చూపడం సమంజసం కాదు" అన్నారు. ఆ వ్యాఖ్యలు జయలలిత అభిమానులకు ఆమోదయోగ్యం కావని స్పష్టం చేశారు.రాబోయే 2026 అసెంబ్లీ ఎన్నికల ముందు ఓపీఎస్ నిర్ణయం రాజకీయ సమీకరణాలను మార్చే అవకాశముంది. 234 స్థానాలున్న తమిళనాడు అసెంబ్లీలో గత ఎన్నికల్లో డీఎంకే కూటమి స్పష్టమైన మెజారిటీ సాధించింది. ఇప్పుడు ద్రవిడ మోడల్ 2.0 నినాదంతో మరోసారి అధికారంలోకి రావాలని స్టాలిన్ ప్రయత్నిస్తున్నారు. మరోవైపు సిద్ధమవుతోంది. అదనంగా సినీనటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం రంగప్రవేశం చేయ డంతో పోటీ త్రిము ఖంగా మారే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు. మొత్తా నికి, జయలలిత నమ్మిన వ్యక్తిగా ఎదిగిన ఓపీఎస్ ఇప్పుడు ప్రత్య ర్థి డీఎంకేలో చేరడం తమిళనాడు రాజకీయాల్లో కొత్త అధ్యా యానికి నాంది పలికినట్టే. ఈ నిర్ణయం రాబోయే ఎన్నికలపై ఎలాంటి ప్రభావం చూపుతుందో చూడాలి.

# 'పదవీవిరమణకు 2 నెలల ముందే కొత్త సీజేల నియామకం' - సుప్రీంకోర్టు కొలీజియం కీలక నిర్ణయం


**న్యూఢిల్లీ:** హైకోర్టు ప్రధాన న్యాయమూర్తుల నియామకంపై సుప్రీంకోర్టు కొలీజియం కీలక నిర్ణయం తీసుకుంది. ఆయా రాష్ట్రాల్లోని హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తుల పదవీ విరమణకు రెండు నెలల ముందే కొత్త సీజేలను నియమించాలని తెలిపింది. దీంతో కొత్త సీజేలు కోర్టు పరిపాలన, వ్యవస్థపై ముందుగానే అవగాహన పొందే అవకాశం ఉంటుందని కొలీజియం భావిస్తోంది.ఈ మేరకు జరిగిన తాజా సమావేశంలో, భారత ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ సూర్య కాంత్ నేతృత్వంలోని కొలీజియం రెండు ముఖ్యమైన హైకోర్టులకు కొత్త ప్రధాన న్యాయమూర్తులను సిఫా ర్సు చేసింది. ఆంధ్రప్రదేశ్, మద్రాస్ హైకోర్టుల్లో త్వరలో ఖాళీ కానున్న సీజే పదవుల భర్తీకి చర్యలు చేపట్టింది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా ప్రస్తుతం చండీగఢ్ హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేస్తున్న జస్టిస్ లీసా గిల్‌ను సిఫారసు చేసింది.ఆమెను ముందుగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు బదిలీ చేసి, ఖాళీ ఏర్పడిన రోజునుంచే చీఫ్ జస్టిస్‌గా బాధ్యతలు స్వీకరించేలా ఏర్పాట్లు చేయాలని నిర్ణయించింది. ఈ ముందస్తు బదిలీ ద్వారా ఆమె కోర్టు పరిపాలన, కేసుల నిర్వహణ, రోస్టర్ వ్యవస్థ వంటి అంశాలను సమగ్రంగా తెలుసుకునే వీలుంటుందని కొలీజియం పేర్కొంది. అటు మద్రాస్ హైకోర్టు విషయానికి వస్తే, ప్రస్తుతం



కేరళ హైకోర్టులో న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ సుశ్రుత్ అరవింద్ ధర్మాధికారి పేరును సిఫారసు చేసింది. మద్రాస్ హైకోర్టు ప్రస్తుత సీజే పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో, ఆయనను మద్రాసు హైకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా నియమించాలని కొలీజియం నిర్ణయించింది.కొలీజియం తెలిపిన ప్రకారం, హైకోర్టుల పరిపాలనలో చీఫ్ జస్టిస్ పాత్ర ఎంతో కీలకం. కేసుల కేటాయింపు, న్యాయమూర్తుల రోస్టర్ నిర్ణయం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, పెండింగ్ కేసుల నిర్వహణ, మొత్తం పరిపాలనా పర్యవేక్షణ వంటి అనేక బాధ్యతలు సీజేలపై ఉంటాయి. కొత్తగా వచ్చినవారు ఒక్కసారిగా బాధ్యతలు చేపట్టడం వల్ల కొంత ఇబ్బంది తలెత్తే అవకాశం ఉంటుంది. అందుకే ముందుగానే బదిలీ చేసి అనుభవం కల్పించడం ద్వారా మొదటి రోజే సమర్థంగా పనిచేయగలరని కొలీజియం భావిస్తోంది.ఇది హైకోర్టుల్లో నాయకత్వ మార్పులను మరింత సజావుగా చేయడానికి తీసుకున్న దీర్ఘకాలిక సంస్కరణగా న్యాయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ముఖ్యంగా ఇటీవల కాలంలో అనేక హైకోర్టుల్లో తరచూ సీజే మార్పులు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో, ఈ కొత్త విధానం స్థిరత్వాన్ని తీసుకురానుందని అంటున్నారు. అలాగే, మాతృ హైకోర్టుకు బయటనుంచే చీఫ్ జస్టిస్ నియామకం చేయాలనే నిబంధన అమల్లో ఉన్నందున, కొత్త ప్రదేశంలో ముందస్తు పరిచయం అవసరమని న్యాయ నిపుణులు చెబుతున్నారు. ఇక ఈ నిర్ణయం అమలుతో, ఏపీ, మద్రాస్ హైకోర్టుల్లో త్వరలోనే కొత్త ప్రధాన న్యాయమూర్తులు బాధ్యతలు చేపట్టనున్నారు.

# దిల్లీ మద్యం పాలసీ కేసును కొట్టివేసిన సీబీఐ కోర్టు

**దిల్లీ :** దేశ రాజధానిలో ఆప్ పతనానికి కారణమైన మద్యం విధాన రూ పకల్పనలో అవినీతి హై-ప్రొఫైల్ కేసును దిల్లీ రౌజ్ అవెన్యూ కోర్టు కొట్టివేసింది. స్పష్టమైన ఆధారాలు లేకుండా కేజ్రీవాల్‌ను కేసులో ఇరికించారని సీబీఐపై కోర్టు తీవ్రంగా మండిపడింది. ఎక్సైజ్ పాలసీలో ఎలాంటి కుట్ర లేదా నేరపూరిత ఉద్దేశ్యం లేదని న్యాయస్థానం పేర్కొంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొన్న కల్వ కుంట్ల కవిత సహా 23 మందికి విముక్తి కల్పిస్తూ తీర్పు ఇచ్చింది. వారిపై చర్యలు తీసుకోవడానికి తగిన సాక్ష్యాలను సమ ర్పించడంలో జదీ× విఫలమైందని పేర్కొంది. నిందితులపై ప్రాథ మిక కేసులు నమోదు చేయలేదని, సీబీఐ ఛార్జిషీట్‌లో అనేక లోపాలు ఉన్నాయని న్యాయమూర్తి అన్నారు. ఏ సాక్షి, వాంగ్మూ లంతో చార్జిషీట్‌లోని అభియోగాలు సరిపోవడం లేదని పేర్కొన్నా రు. దిల్లీ మద్యం విధాన రూపకల్పన కేసులో "సౌత్ గ్రూప్" అనే పదాన్ని ఉపయోగించడంపై కోర్టు అభ్యంతరం వ్యక్తంచేసింది. అలాంటి వ్యక్తీకరణకు స్పష్టత, సరైన ఆధారాలు లేవని తెలిపింది.కన్నీరుపెట్టుకున్న కేజ్రీవాల్‌కోర్టు తీర్పు అనం తరం ఆవరణలో మీడియా ముందు మాట్లాడుతూ కన్నీటి పర్యంతమయ్యారు కేజ్రీవాల్. "ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ఐదు గురు నేతలను జైలులో పెట్టారు. సీఎం, డిప్యూటీ సీఎం సహా ఐదుగురిని జైలులో పెట్టారు. కేజ్రీవాల్ ఏనాడూ అవినీతికి పాల్ప డలేదు. అవినీతికి వ్యతిరేకంగా పోరాడినవాళ్లం మేం. ప్రధాని మోదీ కేవలం విపక్షాలపైనే దృష్టి పెట్టారు. ప్రజల సమస్యలను ప్రధాని మోదీ ఏమాత్రం పట్టించుకోరు. నిరుద్యోగం, దిల్లీలో పొల్యూషన్ గురించి మోదీ మాట్లాడరు. విపక్ష నేతలను రాజకీ యంగా వేధించడం గురించి మోదీ ఆలోచిస్తారు" అని ఆరోపి ంచారు. తాను, మనీశ్ సిసోదియా ఇద్దరూ నిజాయితీపరులు అని



కోర్టు చెప్పిందని ఆయన అన్నారు."నేను అవినీతిపరుడిని కాదు. కేజ్రీవాల్, మనీశ్ సిసోదియా నిజాయితీపరులని కోర్టు చెప్పింది. నేడు ఈ కేసులోని నిందితులందరినీ కోర్టు విడుదల చేసింది. నిజం గెలుస్తుందని మేం ఎప్పుడూ చెబుతుంటాం. భారత న్యాయ వ్యవస్థపై మాకు పూర్తి నమ్మకం ఉంది. అమిత్ షా, మోదీ కలిసి ఆప్‌ను అంతం చేయడానికి అతిపెద్ద రాజకీయ కుట్రను పన్నారు. మా పార్టీకి చెందిన ఐదుగురు పెద్ద నాయకులను జైలులో పెట్టారు. కేజ్రీవాల్ అవినీతిపరుడు కాదు. నా జీవితంలో నేను నిజాయితీని మాత్రమే సంపాదించుకున్నాను. నేడు కేజ్రీవాల్, మనీశ్ ఆప్ నిజాయితీపరులని కోర్టు పేర్కొంది" అని అన్నారు.ఎన్నో ప్రయత్నాలు చేసినప్పటికీ!"సత్యమేవ జయతే. ఈరోజు మరోసారి బాబా సాహెబ్ అంబేద్కర్ దార్శనిక ఆలోచన, ఆయన రూపొందించిన రాజ్యాంగం పట్ల నేను గర్వపడుతున్నాను. మోదీ జీ మొత్తం పార్టీ, వారి అన్ని సంస్థలు మమ్మల్ని నిజాయితీ లేనివారని నిరూపించడానికి ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ, నేడు అరవింద్ కేజ్రీవాల్ - మనీశ్ సిసోదియా చాలా నిజాయితీపరులని నిరూపితమైంది" అని ఆయన అన్నారు."సాక్ష్యాధారాలు, వాగ్మూలాలు అన్ని పరిశీలించిన తర్వాత సీబీఐ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌లో నిందితులపై ఎటువంటి ప్రాథమిక ఆధారాలు లేవని కోర్టు నిర్ధారించింది. కొందరికి ప్రయోజనం చేకూర్చేలా ఎక్సైజ్ పాలసీని మార్చారనేది ప్రధాన ఆరోపణ. అయితే, ఈ పాలసీ వాటాదారులు, సంబంధిత సంస్థల ఆమోదంతోనే తయారు చేసినట్టు న్యాయస్థానం పేర్కొంది. ఈ విధానాన్ని లెఫ్టినెంట్ గౌవర్నర్ కూడా ఆమోదించారు. లెఫ్టినెంట్ గవర్నర్‌ను నిందితునిగా చేర్చకుండా మిగిలినవారిని ఏలా బాధ్యులను చేస్తారని ప్రశ్నించింది. వీటన్నింటిని పరిశీలించిన న్యాయస్థానం నిందితులందరినీ నిర్దోషులుగా ప్రకటించింది.సీబీఐ కేసు కొట్టివేసిన తర్వాత, దానికి అనుబంధంగా ఉన్న ఈడీ కేసు కూడా రద్దవుతుంది."వివేక్ జైన్, న్యాయవాదికేసు ఏమిటంటే?దిల్లీ ప్రభుత్వం 2021 నవంబర్ 17న మద్యం పాలసీని తీసుకొచ్చింది. 2022 సెప్టెంబరు చివరికి దానిని వెనక్కి తీసుకుంది. ఈ మధ్యలో మద్యం విధానంలో పలు అవకతవకలు జరిగాయని.. ఆప్ నేతలు మనీలాండరింగ్‌కు పాల్పడ్డారంటూ ఆరోపణలు వచ్చాయి. ఎక్సైజ్ పాలసీని సవరించేటప్పుడు వీరు అక్రమాలకు పాల్పడ్డారని సీబీఐ, ఈడీలు ఆరోపించాయి. లైసెన్స్‌దారులకు అవసరమైన సాయం చేసి, ప్రతిఫలంగా కొంత మొత్తాన్ని పొందినట్లు దర్యాప్తు సంస్థలు చెప్పాయి. ఈ కుంభకోణంలో భాగంగా దిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మాజీ ఉప ముఖ్యమంత్రి సిసోదియా, ఇతర ఆప్ నేతలు, మాజీ తెలంగాణ ఎంపీ కవితను అధికారులు అరెస్టు చేశారు. అనంతరం వారు బెయిల్‌పై విడుదలయ్యారు.

# అగ్నివీర్‌లు, ఆర్మీ సిబ్బందికి రిటైరయ్యాక రైల్వేలో జాబ్స్- రైల్వే శాఖ, ఆర్మీ 'ఫ్రేమ్ వర్క్

**న్యూఢిల్లీ:** అగ్నివీర్‌లు భారత ఆర్మీ నుంచి రిటైరయ్యాక ఉద్యోగ అవకా శాలను కల్పించే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. ఇందుకోసం భారత రైల్వేశాఖతో భారత ఆర్మీ జట్టు కట్టింది. రైల్వే శాఖ, ఆర్మీ కలిసి సహకార ముసాయిదా (ఫ్రేమ్ వర్క్ ఆఫ్ కోఆపరేషన్)ను అమల్లోకి తెచ్చాయి. ఇందులో భాగం గా రిటైర్డ్ అగ్నివీర్‌లు, ఆర్మీ సిబ్బందికి రైల్వేశాఖలో ఉద్యోగ అవకాశాల కల్పన జరగనుంది. రిటైర్ అయ్యే అగ్నివీర్‌లు, ఆర్మీ సిబ్బందికి రైల్వేశాఖలోని ఉద్యోగ నిర్వహించనున్నారు. ఇందుకోసం ప్రత్యేక హెల్ప్ లైన్ వ్యవస్థను కూడా అందుబాటులోకి తేనున్నారు. ఈమేరకు వివరాలతో రైల్వేశాఖ ఓ ప్రకటన విడుదల చేసింది.ఎక్స్ - అగ్నివీర్లకు అదనపు కోటాఫ్రేమ్‌వర్క్ ఆఫ్ కోఆప రేషన్‌లో భాగంగా మాజీ ఆర్మీ సిబ్బందికి రైల్వేశాఖలోని లెవల్-2, అంతకంటే ఎక్కువ స్థాయి పోస్టుల్లో 10శాతం రిజర్వేషన్లను అమలు చేస్తారు. రైల్వేలోని లెవల్-1 పోస్టుల్లో మాజీ సైనిక సిబ్బ ందికి 20 శాతం



రిజర్వేషన్లు అమలవుతాయి. అయితే ఎక్స్ - అగ్నివీర్‌లకు లెవల్-2, అంతకంటే ఎక్కువ స్థాయి పోస్టుల్లో అద నంగా 5 శాతం, లెవల్ -1 పోస్టుల్లో అదనంగా 10 శాతం కేటా యిస్తామని రైల్వేశాఖ వెల్లడించింది. లెవల్-1 స్థాయి పోస్టులను ఆర్ఆర్‌బీ గ్రూప్-డీ పోస్టులు అని కూడా పిలుస్తారు. లెవల్-1, లెవల్-2 , అంతకంటే పెద్దస్థాయి పోస్టుల భర్తీ రైల్వే రిక్రూ ట్‌మెంట్ సెంటర్లు, రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డుల ద్వారా జరుగు తుంది. ఇందుకోసం ఉద్యోగ పరీక్షలను, ఇంటర్వ్యూలను నిర్వహి స్తారు.పాయింట్స్‌మెన్లుగా మాజీ ఆర్మీ సిబ్బందికి అవకా శాలురెగ్యులర్ రిక్రూట్‌మెంట్ ప్రాసెస్ పూర్తయ్యే వరకు వేగవం తమైన భర్తీలు చేసేందుకుగానూ మాజీ ఆర్మీ సిబ్బందిని కాంట్రా రైల్వేశాఖ వెల్లడించింది. ఇందుకోసం సంబంధిత భారత ఆర్మీ సంస్థలతో 9 రైల్వే డివిజన్లు అవగాహనా ఒప్పందాలు (ఎంఓయూ) కుదుర్చుకున్నాయని తెలిపింది. ప్రస్తుతం 5వేలకు పైగా లెవల్-1 రైల్వే ఉద్యోగాల భర్తీ ప్రక్రియ వివిధ రైల్వే జోనల్, డివిజనల్ స్థాయిల్లో జరుగుతోందని పేర్కొంది. రైల్వేశా ఖలో ఏర్పడే వివిధ ఖాళీలను భర్తీ చేసే అంశంపై ఇకపై భారత ఆర్మీకి చెందిన నియామక సంస్థలతో రైల్వే డివిజన్లు కలిసి పనిచే స్తాయని స్పష్టం చేసింది. 2024, 2025 సంవత్సరాల్లో మొత్తం 14,788 రైల్వే పోస్టులను మాజీ సైనిక సిబ్బంది కోసం రిజర్వ్ చేశామని చెప్పింది. వీటిలో 6,485 లెవల్-1 పోస్టులు, 8,303 లెవల్-2, అంతకంటే పెద్దస్థాయి పోస్టులు ఉన్నాయని పేర్కొంది.

# తమిళనాడులో ప్రజాస్వామ్యానికి గొప్ప చరిత్ర ఉంది





**తమిళనాడు:** రాబోయే అసెంబ్లీ ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించిన సీఈసీ జ్ఞానేశ్ కుమార్?, రాష్ట్రానికి ప్రజాస్వామ్యంలో గొప్ప చరిత్ర ఉందని పేర్కొన్నారు. ప్రాచీన కాలం నుంచే ఇక్కడ కుడవోలై విధానం అమల్లో ఉండేదని, ఇది ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. ఇటీవల ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో 72 దేశాల ప్రతినిధులతో అంతర్జాతీయ సమావేశం నిర్వహించామని చెప్పారు. ఆ సమావేశంలో తమిళనాడులో 10వ శతాబ్దం నుంచే అమలులో ఉన్న కుడవోలై ఎన్నికల విధానం గురించి ప్రపంచానికి వివరించామని అన్నారు. ప్రజాస్వామ్య పండుగగా ఎన్నికలను జరుపుకోవాలని రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో పలు వ్యాఖ్యలు చేశారు.ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా సాగుతోందని సీఈసీ స్పష్టం చేశారు. అర్హులెవరూ నష్టపోకూడదు- అనర్హులెవరూ జాబితాలో చేరకూడదనే లక్ష్యంతోనే ఆ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. తమిళనాడులో అమలు చేస్తున్న విధానం దేశానికి మోడల్‌గా నిలుస్తోందని, ఇది గొప్ప విజయమని పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా 75 వేల పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఓటర్లకు తాగునీరు, విద్యుత్, ర్యాంపులు, వృద్ధులు, వికల ాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

# ఈడీ హడావిడి దర్యాప్తు, అరెస్టులతో రాజ్యాంగ హక్కులకు భంగం: సీబీఐ ప్రత్యేక కోర్టు




**న్యూఢిల్లీ:** మనీలాండరింగ్ నిరోధక చట్టం అమలు జరుగుతున్న తీరుపై ఢిల్లీలోని రౌస్ ఎవెన్యూ కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరైట్ హడావిడి దర్యాప్తులు చేయడం, అరెస్టుల దిగడం రాజ్యాంగ హక్కులకు విరుద్ధమవుతుందని పేర్కొంది. ప్రాథమిక నేరం నిరూపిం చకముందే పీఎంఎల్‌ఏ కింద అరెస్టు చేసి, దీర్ఘకాలం జైలులో ఉంచరాదని ప్రత్యేక న్యాయమూర్తి (పీసీ చట్టం) జితేంద్ర సింగ్ పేర్కొన్నారు.సీబీఐ అధికారిపై డిపార్ట్‌మెంట్ చర్యలుఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, ఉప ముఖ్యమంత్రి సోసిడియాతో సహా నిందితులందరికీ రౌస్ ఎవెన్యూ కోర్టు శుక్రవారంనాడు క్లీన్ చిట్ ఇచ్చింది. సీబీఐ ఛార్జిషీటులో మెరిట్ లేదంటూ కేసు నుంచి 23 మంది నిందితులకు విముక్తి కల్పించింది. ఢిల్లీ ఎక్సైజ్ కేసును ఇన్వెస్టిగేట్ చేసిన సీబీఐ అధికారిపై డిపార్ట్‌మెంట్ పరమైన చర్యలు తీసుకోవాలని కోర్టు ఆదేశించింది. ఈ సందర్భంగా పీఎంఎల్‌ఏ కింద కేసులపై ప్రత్యేక న్యాయమూర్తి కీలక వ్యాఖ్యలు చేశారు.ప్రాథమిక నేరం లేకపోతే మనీలాండరింగ్ కేసు నిలువదంటూ సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన విషయాన్ని ప్రత్యేక న్యాయమూర్తి ఈ సందర్భంగా గుర్తు చేశారు. ముందస్తు నిర్బంధం శిక్షలా మారకూడదని అన్నారు. వ్యక్తిగత స్వేచ్ఛకు రాజ్యాంగం హామీ ఇచ్చిందని, అది చట్టపరమైన సమతుల్యతతోనే పరిమితం చేయాలని అన్నారు. న్యాయం అనేది సులభమైన కథనాన్ని అనుసరించదని, సాక్ష్యాల ఆధారంగా నిర్ణయం తీసుకుంటుదని స్పష్టం చేశారు.

# తమిళనాడులో ఒకే విడతలో పోలింగ్.. పరిశీలిసున్నామని చెప్పిన సీఈసీ



**చెన్నై:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు ఒకే విడతలో నిర్వహించాలని పలు పార్టీలు సూచించినట్టు సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తెలిపారు. వారి విజ్ఞప్తులను వివిధ కోణాల నుంచి పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పుడే దీనిపై ఒక స్పష్టత ఇస్తామని అన్నారు.తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల సన్నద్ధతపై జ్ఞానేశ్ కుమార్ శుక్రవారంనాడు సమీక్ష జరిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ఇటీవల రాష్ట్రంలో జరిపిన ఎస్ఐఆర్ ప్రక్రియ దేశానికే ఒక మోడల్‌గా నిలిచిందని, విజయవంతంగా ఈ ప్రక్రియ పూర్తయిందని చెప్పారు. ఎస్ఐఆర్‌తో పెద్ద ఎత్తున ఓటర్లను జాబితా నుంచి తొలగించనున్నట్టు కొన్ని రాజకీయల పార్టీలు విమర్శించినప్పటికీ, ఓటర్ల జాబితా ప్రక్షాళన విషయంలో ఈసీ అధికారులు ఎంతో ప్రొఫెషనలిజం కనబరిచారని ప్రశంసించారు. ఇటీవల కాలంలో ఏమాత్రం పొరపాట్లకు తావీయకుండా బీహార్ ఎన్నికలు జరిగాయని, అంతకు మించి మరింత మెరుగ్గా తమిళనాడులో ఎన్నికలు నిర్వహిస్తామని, సరికొత్త రికార్డు సృష్టిస్తామని తెలిపారు.కౌటింగ్ అయిన వారం వరకూఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయిన ఏడు రోజుల వరకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల్లో నమోదైన ఓట్లతో వీవీపాట్ల స్లిప్పులను వెరిఫై చేసుకోవడానికి అభ్యర్థులను అనుమతిస్తామని సీఈసీ తెలిపారు. అయితే ఇందుకు కొంత మొత్తం చెల్లించాలని అన్నారు. ఈవీఎం రౌండ్లకు ముందు పోస్టల్ బ్యాలెట్లను రెండు రౌండ్లు కౌంటింగ్ జరుపుతామని చెప్పారు.

# దేశ ప్రజలకు మోదీ, అమిత్ షా క్షమాపణలు చెప్పాల్సిందే

**న్యూఢిల్లీ:** దేశ ప్రజలకు మోదీ, అమిత్ షా క్షమాపణలు చెప్పాల్సిందే' దేశ ప్రజలకు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా క్షమాపణలు చెప్పాలని ఆప్ కన్వీనర్, మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ డిమాండ్ చేశారు. మోదీ, అమిత్ షా కుట్రల వల్ల దిల్లీ ప్రజలకు నష్టం జరిగిందని ఆరోపించారు. ఈ మేరకు మీడియాతో మాట్లాడుతూ శుక్రవారం పలు వ్యాఖ్యలు చేశారు. అయితే దిల్లీ మద్యం పాలసీ కేసులో కేజ్రీవాల్? సహా పలువురిపై నమోదైన కేసులును రౌస్ అవెన్యూ కోర్టు కొట్టివేసింది."నా



తరపున కోర్టులో పోరాడిన లాయర్లకు ధన్యవాదాలు. మాపై సీబీఐ, ఈడీ అస్త్రాలను ఉపయోగించారు. ఆప్ నేతలపై తప్పుడు కేసులు పెట్టారు. సీబీఐ విచారణ తీరును కోర్టు తప్పుపట్టింది. కోర్టు చరిత్రాత్మక తీర్పునిచ్చింది. దేశ ప్రజలకు మోదీ, అమిత్‌షా క్షమాపణలు చెప్పాలి. కేజ్రీవాల్ నిజాయితీ ఏంటో ప్రజలకు తెలుసు. తప్పుడు కేసులతో ఆప్ కీలక నేతలను జైలుకు పంపారు. దిల్లీ ప్రజల మేలు కోసమే మేం పనిచేశాం. ఆ కేసును ఫేక్ కేసు అని కోర్టు కూడా వ్యాఖ్యానించింది" అని తెలిపారు.తమ హయాంలో దిల్లీలో రోడ్లు, పాఠశాలలు, ఆస్పత్రులు నిర్మించామని కేజ్రీవాల్ తెలిపారు. తమ కంటే ఎక్కువ పనిచేయాలని బీజేపీని కోరుతున్నామని అన్నారు. కేసులతో వేధించడంతో తమ కుటుంబసభ్యులు అనేక ఇబ్బంది పడ్డారని చెప్పారు. మోదీ, అమిత్ షా కుట్రల వల్ల దిల్లీ ప్రజలకు నష్టం జరిగిందని ఆరోపించారు. అయితే ప్రధాని మోదీకి విసురుతున్నానని, దిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు పెడితే, బీజేపీకి 10 సీట్లు కూడా రావని చెప్పారు.



## రింకు తండ్రి ఖాన్‌చంద్ సింగ్
# అనారోగ్యంతో మృతి

టీమ్ ఇండియా క్రికెటర్ రింకు సింగ్ కుటుంబంలో విషాదం నెలకొంది. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన తండ్రి ఖాన్‌చంద్ సింగ్ అనారోగ్యంతో మృతిచెందారు. స్టేజ్-4 కాలేయ క్యాన్సర్‌తో పోరాడుతూ, శుక్రవారం తెల్లవారుజామున నొయిడాలోని ఓ ఆస్పత్రిలో మరణించారు. తండ్రి అనారోగ్యం విషయం తెలిసిన వెంటనే హుటాహుటిన చికిత్స పొందుతున్న నోయిడాలోని ఆస్పత్రికి రింకూ వెళ్లారు. ఈ నేపథ్యంలోనే గురువారం రాత్రి జరిగిన జింబాబ్వే మ్యాచ్‌కు రింకూ దూరమయ్యారు.ఫిబ్రవరి 26న చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియంలో జింబాబ్వేతో జరిగిన 2026 టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌లో రింకు ఆడలేదు. తండ్రి ఆరోగ్య పరిస్థితి బాగోలేదని కారణంగా జట్టు నుంచి బయటికి వెళ్లిన రింకు, తండ్రి మరణంతో మళ్లీ జట్టు నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. అతడి స్థానంలో సంజు శాంసన్‌ను తీసుకున్నారు. దీంతో అతడు జింబాంబ్వేతో ఆడాల్సిన మ్యాచ్‌లో స్థానం కోల్పోయాడు. అభిషేక్ శర్మతో కలిసి సంజు శాంసన్ను ఆ మ్యాచ్‌లో ఓపెనింగ్ చేశాడు.రింకు తండ్రి తన కుటుంబాన్ని పోషించడానికి, తన పిల్లలకు మంచి జీవితం అందించడానికి చాలా కృషి చేశారు. గ్యాస్ డెలివరీ మ్యాన్‌గా పనిచేస్తూ కుటుంబానికి కావాల్సినవన్నీ సమకూర్చేవారు. కుటుంబం ఆర్థిక పరిస్థితి ఎదుర్కొంటున్నప్పటికీ రింకుకు క్రికెటర్‌పై ఉన్న ఆసక్తి గమనించి అతడి కలలు నెరవేర్చేందుకు మద్దతుగా నిలిచాడు. మరోవైపు రింకూ సింగ్ తండ్రి మరణంపై భారత మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ కూడా స్పందించారు. రింకు తన క్రికెట్ బాధ్యతలకు కట్టుబడి ఉన్నప్పటికీ, ఈ సమయంలో అతని కుటుంబానికి ఇది చాలా కష్టమైన సమయం అని తెలిపారు.

# భారత్‌పై ఆస్ట్రేలియా విజయం

ఆస్ట్రేలియా మహిళల జట్టు భారత్‌పై వరుసగా రెండో విజయం సాధించింది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా భారత్‌తో ఓవల్ వేదికగా జరిగిన రెండో వన్డేలో ఆసీస్ 5 వికెట్ల తేడాతో నెగ్గింది. భారత్ నిర్దేశించిన 252 పరుగుల టార్గెట్‌ను ఆస్ట్రేలియా 36.1 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. జార్జియా వోల్ (101 పరుగులు) సెంచరీతో అదరగొట్టగా, ఫోబి లిచీఫీల్డ్ (80 పరుగులు) రాణించింది. భారత్ బౌలర్లలో కాశ్వీ గౌతమ్, దీప్తి శర్మ చెరో 2, క్రాంతి గౌడ్ 1 వికెట్ దక్కించుకున్నారు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 50 ఓవర్లోల 9 వికెట్లకు 251 పరుగులు చేసింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (51 పరుగులు), ఓపెనర్ ప్రతికా రావల్ (52 పరుగులు) హాఫ్ సెంచరీలతో రాణించారు. స్మృతి మంధాన (31 పరుగులు), కాశ్వీ గౌతమ్ (25 పరుగులు) ఫర్వాలేదనిపించారు. ఆసీస్ బౌలర్లలో అష్లీ గార్డ్‌నర్, అనబెల్, అలన కింగ్ తలో 2, నికోల కేరీ, మేగన్ చెరో 1 వికెట్ దక్కించుకున్నారు. తాజా విజయంతో ముడు వన్డేల సిరీస్‌ను ఆసీస్ ఇంకో మ్యాచ్ మిగిలి ఉండగానే 2-0తో దక్కించుకుంది. మంగళవారం జరిగిన తొలి వన్డేలోనూ భారత్ ఓడింది. ఇక ఇరుజట్ల మధ్య నామమాత్రమైన మూడో మ్యాచ్ మార్చి 01న ఓవల్ వేదికగానే జరగనుంది. ఆ తర్వాత మార్చి 06న ఏకైక టెస్టు మ్యాచ్ ప్రారంభం కానుంది.




# అభిషేక్‌పై యువరాజ్ సింగ్ ప్రశంసలు

టీమ్‌ఇండియా యంగ్ బ్యాటర్ అభిషేక్ శర్మ ఎట్టకేలకు ఫామ్‌లోకి వచ్చాడు. ఈ టోర్నమెంట్‌లో వరుసగా నాలుగు ఇన్నింగ్స్‌ల్లో ఘోరంగా విఫలమైన ఈ యువ ఓపెనర్ తాజాగా జింబాబ్వేతో మ్యాచ్‌లో అర్ధ శతకంతో రాణించాడు. 30 బంతుల్లో 55 పరుగులు చేసి, తన ఫామ్‌పై మేనేజ్‌మెంట్‌కు ఉన్న అనుమానాలన్నింటినీ పటాపంచలు చేశాడు. ఈ క్రమంలోనే అతడి ఇన్నింగ్స్‌పై మాజీ క్రికెటర్, తన మెంటార్ యువరాజ్ సింగ్ మోటివేషనల్ మెసేజ్ పంపించాడు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఇన్‌స్టాగ్రామ్‌లో స్టోరీ షేర్ చేశాడు. అభిషేక్ ఇన్నింగ్స్‌పై ప్రశంసలు కురిపిస్తూ మెసేజ్ రాసుకొచ్చాడు. 'అర్థంలేని చర్చలు జరుగుతున్నప్పుడు బ్యాటింగ్ తోనే మాట్లాడావు. అభిషేక్ సార్ ఇది మంచి ప్రదర్శన. ఇలాగే ముందుకు సాగిపో' అని ఇన్‌స్టా స్టోరీ రాసుకొచ్చాడు. అయితే ఈ టోర్నీలో అభిషేక్ వరుసగా ఫెయిల్ అవ్వడంతో అతడిపై తీవ్రంగా విమర్శలు వచ్చాయి. అందుకే అతడికి మద్దతుగా యువీ ఈ మెసేజ్ షేర్ చేశాడని ఫ్యాన్స్ అనుకుంటున్నారు. అలాగే ఈ మ్యాచ్‌లో ఆకట్టుకున్న హార్దిక్ పాండ్య, అర్షదీప్ సింగ్‌పై కూడా యువీ ప్రశంసలు కురిపించాడు. 'అద్భుతమైన పవర్ హిట్టింగ్. ఇన్నింగ్స్‌ను అద్భుతంగా ముంగించావు' అని హార్దిక్‌ను ప్రశంసించగా, 'స్పీడ్‌స్టర్ అర్షదీప్ ట్రిపుల్ ధమాకా. సరైన సమయంలో వికెట్లు తీసి ప్రత్యర్థులను




ఒత్తిడిలోకి నెట్టావు' అని యువీ పోస్టు చేశాడు. ఇటీవల అభిషేక్ విఫలం అవ్వడం వల్ల అతడు తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నాడు. ఈ క్రమంలోనే పాకిస్థాన్ మాజీ క్రికెటర్ మహ్మద్ ఆమిర్ కూడా అభిషేక్‌పై తీవ్ర విమర్శలు గుప్పించాడు. 'అభిషేక్‌కు డిఫెన్సివ్ క్రికెట్ ఆడడం రాదు. స్కిల్స్ లేవు, అతడు ఓ స్లోగర్ మాత్రమే' అని వ్యాఖ్యానించాడు. అయితే ఆమిర్ వ్యాఖ్యలకు తాజాగా టీమ్‌ఇండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ కౌంటర్ ఇచ్చాడు. తన యూట్యూబ్ ఛానెల్‌లో దీనిపై మాట్లాడాడు. 'అభిషేక్‌పై మహ్మద్ ఆమిర్ చేసిన కామెంట్స్ తాలూకు వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.



# శ్రీలంక జట్టులో భారీ మార్పులు..

టీ20 వరల్డ్ కప్ 2026లో దారుణ ప్రదర్శన తర్వాత శ్రీలంక క్రికెట్ జట్టులో మార్పులు చోటుచేసుకోనున్నాయి. సహ-ఆతిథ్య దేశం అయిన శ్రీలంక జట్టు టోర్నమెంట్ సూపర్-8 దశ నుండే నిష్క్రమించడం జట్టుకు, అభిమానులకు తీవ్ర నిరాశ కలిగించింది. పొట్టి ప్రపంచ కప్‌లో లంక ప్రదర్శన ప్రభావం జట్టు కెప్టెన్, సెలక్షన్ కమిటీపై పడే అవకాశం ఉంది. కెప్టెన్ దాసున్ షనకను తొలగిస్తారని మాజీ క్రికెటర్లు అంచనా వేశారు.గ్రూప్ స్టేజ్‌లో వరుసగా 3 మ్యాచ్‌లు గెలిచి అద్భుతమైన ఆరంభాన్ని ఇచ్చిన శ్రీలంక జట్టుపై భారీ అంచనాలు ఉన్నాయి. అయితే లంక జట్టు సూపర్-8కు చేరుకోగానే, దాని ప్రదర్శన దారుణంగా తయారైంది. సూపర్ 8 పోరులో తొలి మ్యాచలో ఇంగ్లాండ్‌తో ఓటమి చవిచూసింది. ఆ తర్వాత న్యూజిలాండ్ సైతం లంకేయుల్ని తేలికగా ఓడించింది. ఈ రెండు వరుస ఓటములతో శ్రీలంక జట్టు దాదాపు సెమీఫైనల్ రేసు నుంచి తప్పుకున్నట్లే. 2014లో టీ20 వరల్డ్ కప్ గెలిచిన శ్రీలంక జట్టు, గత కొన్ని సంవత్సరాలుగా మేజర్ టోర్నమెంట్లలో టాప్-4 కి కూడా చేరుకోలేకపోతోంది. స్వదేశంలో ఆడటం కలిసొచ్చే అంశమైనా తీవ్రంగా నిరాశపరుస్తూ లంక జట్టు అంచనాలను అందుకోలేకపోయింది. మరోసారి ప్రపంచ కప్ నెరవేరకుండానే, కనీసం తుది పోరుకు సైతం చేరకుండానే ఇంటి బాట పట్టింది. దాంతో లంక క్రికెట్ బోర్డు కీలక నిర్ణయాలు తీసుకోనుంది.

# పాకిస్థాన్ మాజీ పేసర్ మహమ్మద్ అమీర్‌కు అశ్విన్ కౌంటర్



టీమిండియా ఓపెనర్ అభిషేక్ శర్మపై మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ప్రశంసల జల్లు కురిపించాడు. అతనిది అసూయపడే బ్యాట్ స్వింగ్ అని కొనియాడాడు. అభిషేక్ శర్మ గాలిగాడంటూ పాకిస్థాన్ మాజీ పేసర్ మహమ్మద్ అమీర్ చేసిన వ్యాఖ్యలకు అశ్విన్ తనదైన శైలిలో కౌంటరిచ్చాడు.ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో వరుసగా మూడు మ్యాచ్‌ల్లో డకౌట్ అయిన అభిషేక్ శర్మ.. జింబాబ్వేతో మ్యాచ్‌లో హాఫ్ సెంచరీతో ఎట్టకేలకు ఫామ్ అందుకున్నాడు. 30 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లతో 55 పరుగులు చేశాడు. ఈ మ్యాచ్‌లో భారత్ 72 పరుగులతో గెలిచి సెమీస్ ఆశలను సజీవంగా ఉంచుకుంది.ఈ మ్యాచ్ అనంతరం తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మాట్లాడిన అశ్విన్.. అభిషేక్ శర్మను కొనియాడుతూ... మహమ్మద్ అమీర్‌కు కౌంటరిచ్చాడు. 'అభిషేక్ శర్మను 'స్లాగర్'(బంతిని విచక్షణారహితంగా బాదే వ్యక్తి) అని పిలుస్తూ మహమ్మద్ అమీర్ చేసిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. నేను ఒక విషయం స్పష్టం చేయాలనుకుంటున్నా.. మీరు అభిషేక్ ఆట గురించి ఏదైనా చెప్పండి. కానీ అతను మాత్రం స్లాగర్ కాదు. ప్రస్తుత క్రికెట్‌లో ఎవరైనా అసూయపడేంత గొప్ప బ్యాట్ స్వింగ్ అతని సొంతం. యువరాజ్ సింగ్ అతని మెంటార్ అని మనందరికీ తెలుసు.అభిషేక్ బ్యాట్ స్వింగ్ యువరాజ్ కంటే మెరుగ్గా ఉంటుంది.




# అర్ష్‌దీప్ సింగ్ సరికొత్త చరిత్ర

ఐసీసీ టీ20 వరల్డ్ కప్ 2026లో టీమిండియా జైత్రయాత్ర కొనసాగుతోంది. గురువారం చెన్నై వేదికగా జరిగిన సూపర్-8 పోరులో భారత్ 72 పరుగుల తేడాతో జింబాబ్వేను చిత్తు చేసింది. ఈ విజయంతో భారత్ సెమీఫైనల్ బెర్త్‌కు అడుగు దూరంలో నిలిచింది. ముందుగా బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 256 పరుగులు చేసింది. ఇది టీ20ల్లో భారత్‌కు అత్యధిక స్కోరు కాగా, వరల్డ్ కప్ చరిత్రలో రెండో అతిపెద్ద స్కోరు. బ్యాటర్లు శివాలెత్తిన వేళ, బౌలింగ్‌లో అర్ష్‌దీప్ సింగ్ సరికొత్త రికార్డులతో చరిత్ర సృష్టించాడు. ఈ మ్యాచ్‌లో టీమిండియా యువ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ రికార్డుల వేట సాగించాడు. జింబాబ్వేపై 4 ఓవర్లలో కేవలం 24 పరుగులిచ్చి 3 కీలక వికెట్లు పడగొట్టాడు. ఈ క్రమంలో టీ20 వరల్డ్ కప్ చరిత్రలో భారత్ తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. ఇప్పటివరకు 33 వికెట్లతో అగ్రస్థానంలో ఉన్న జస్ప్రీత్ బుమ్రాను అర్ష్‌దీప్ అధిగమించాడు. కేవలం 19 మ్యాచుల్లోనే అర్ష్‌దీప్ 35 వికెట్లు తీసి ఈ ఘనత సాధించడం విశేషం. బుమ్రా 23 మ్యాచుల్లో 33 వికెట్లు తీయగా, అశ్విన్ (32 వికెట్లు), హార్దిక్ పాండ్యా (29 వికెట్లు) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. అంతేకాకుండా టీ20 వరల్డ్ కప్ చరిత్రలో ఒక లెఫ్ట్ ఆర్మ్ పేసర్‌గా అత్యధిక వికెట్లు తీసిన ప్రపంచ రికార్డును కూడా అర్ష్‌దీప్ తన పేరిట రాసుకున్నాడు.

# గంభీర్-సూర్య వేసిన మాస్టర్ ప్లాన్ అదుర్స్

ఐసీసీ టీ20 వరల్డ్ కప్ 2026లో టీమిండియా యువ ఓపెనర్ అభిషేక్ శర్మ ఎట్టకేలకు తన పవర్ ఏంటో చూపించాడు. సూపర్ 8 దశలో జింబాబ్వేతో జరిగిన మ్యాచ్‌లో ఈ లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ సిక్సర్ల సునామీ సృష్టించాడు. ఈ టోర్నమెంట్‌లో ఇప్పటివరకు వరుసగా మూడు సార్లు డకౌట్ (0) అయి తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న అభిషేక్, సరైన సమయంలో ఫామ్‌లోకి వచ్చి అందరి నోళ్లు మూయించాడు. చెన్నైలోని చెపాక్ స్టేడియంలో జరిగిన ఈ పోరులో కేవలం 30 బంతుల్లోనే 55 పరుగులు బాదాడు. ఇందులో 4 ఫోర్లు, 4 కళ్లు చెదిరే సిక్సర్లు ఉన్నాయి. టీ20 వరల్డ్ కప్‌లో అతనికి ఇది మొదటి హాఫ్ సెంచరీ కావడం విశేషం. అభిషేక్ శర్మ ఇలా ఒక్కసారిగా గాడిలో పడటం వెనుక టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ వేసిన ఒక తెలివైన మాస్టర్ ప్లాన్ ఉంది. ఈ మ్యాచ్‌కు ముందు వరకు అభిషేక్ ఫామ్ చాలా దారుణంగా ఉండేది. లెఫ్ట్ హ్యాండర్ కావడంతో ప్రత్యర్థి జట్లు ఆఫ్ స్పిన్నర్లను రంగంలోకి




దింపి అతడిని కట్టడి చేసేవి. అయితే ఈసారి గంభీర్-సూర్య ద్వయం ఒక వ్యూహాన్ని మార్చారు. ఇషాన్ కిషన్‌ను పక్కన పెట్టి, సంజూ శామ్సన్‌ను జట్టులోకి తీసుకోవడమే కాకుండా నేరుగా ఓపెనింగ్‌కు పంపారు. దీనివల్ల లెఫ్ట్-రైట్ కాంబినేషన్ కుదిరి జింబాబ్వే కెప్టెన్ లెక్కలు తలకిందులయ్యాయి. సాధారణంగా ఇద్దరు లెఫ్ట్ హ్యాండర్లు ఓపెనింగ్ చేస్తే ప్రత్యర్థులు ఆఫ్ స్పిన్నర్లతో బౌలింగ్ మొదలుపెడతారు. కానీ ఈసారి రైట్ హ్యాండర్ అయిన సంజూ శామ్సన్ క్రీజులోకి రావడంతో జింబాబ్వే ఆ సాహసం చేయలేకపోయింది. సంజూ స్పిన్‌ను అద్భుతంగా ఆడతాడు కాబట్టి, వారు పేసర్లను దించక తప్పలేదు. పేస్ బౌలింగ్‌ను చీల్చి చెండాడటంలో అభిషేక్ సిద్ధహస్తుడు. సరిగ్గా ఇదే జరిగింది. సంజూ శామ్సన్ 15 బంతుల్లోనే 24 పరుగులు చేసి మంచి పునాది వేయగా, అభిషేక్ తన దూకుడుతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. వీరిద్దరి మధ్య కుదిరిన 48 పరుగుల భాగస్వామ్యం ఈ టోర్నీలో భారత్‌కు అత్యుత్తమ ఓపెనింగ్ పార్ట్‌నర్‌షిప్. పవర్ ప్లే ముగిసేసరికి భారత్ ఏకంగా 80 పరుగులు చేసింది. ఈ అదిరిపోయే ఆరంభం వల్లే టీమిండియా 256 పరుగుల భారీ స్కోరును సాధించగలిగింది. అభిషేక్ శర్మ తిరిగి ఫామ్‌లోకి రావడం, సంజూ శామ్సన్ మెరుపులు మెరిపించడం చూస్తుంటే గంభీర్ వ్యూహం నూటికి నూరు శాతం ఫలించిందని అర్థమవుతోంది.

# నిఖిల్ కూడా వారి దారిలోనే!



టాలీవుడ్‌లో ఓటీటీ విప్లవం రోజురోజుకీ మరింత వేగం అందుకుంటోంది. థియేటర్లతో పాటు డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు కూడా స్టార్ హీరోలకు సమాన వేదికలుగా మారుతున్నాయి. ఈ క్రమంలో టాలీవుడ్ యంగ్ హీరో నిఖిల్ సిద్ధార్థ్ కూడా త్వరలో ఓటీటీ ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు ప్రకటించడం ఇండస్ట్రీలో చర్చనీయాంశమైంది. ఇప్పటికే పీరియడ్ యాక్షన్ డ్రామా స్వయంభుతో పాటు పలు భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్న నిఖిల్, ఇప్పుడు డిజిటల్ వరల్డ్‌లో కూడా తన ముద్ర వేయాలని చూస్తున్నార

నిఖిల్ మాత్రమే కాదు, గత కొన్ని సంవత్సరాల్లో టాలీవుడ్‌కు చెందిన పలువురు ప్రముఖ హీరోలు ఓటీటీ ప్లాట్‌ఫారమ్‌లలో అడుగుపెట్టారు. రానా నాయుడు వెబ్‌సిరీస్ తో ఇప్పటికే వెంకటేష్, రానా ఓటీటీ లోకి ఎంట్రీ ఇచ్చి, ఆడియన్స్ ను అలరించారు. ఇక నాగ చైతన్య దూత అనే వెబ్‌సిరీస్ ద్వారా ఓటీటీలో అడుగుపెట్టి తనలోని ఇంటెన్స్ యాక్టర్‌ను చూపించారు. ఈ సిరీస్‌కు విమర్శకుల ప్రశంసలు లభించాయి. ప్రయోగాలు చేయడానికి రెడీ సత్యదేవ్ కూడా పలు డిజిటల్ ప్రాజెక్టులతో ఓటీటీలో తన రేంజ్‌ను విస్తరించారు. థియేటర్లలో మాత్రమే కాకుండా, ఓటీటీ వేదికల ద్వారా కథల ఎంపికలో ప్రయోగాలు చేయడానికి హీరోలు ఆసక్తి చూపుతున్నారు. ఓటీటీ ప్లాట్‌ఫార్మ్ కు పెరుగుతున్న ప్రాధాన్యం, పాన్ ఇండియా రీచ్, భాషా అవరోధాల తొలగింపు వంటి అంశాలు స్టార్ హీరోలను ఈ వైపు ఆకర్షిస్తున్నాయి. థియేట్రికల్ మార్కెట్‌కు పరిమితమైన కలెక్షన్లకు బదులుగా, డిజిటల్ ద్వారా గ్లోబల్ ఆడియెన్స్‌ను చేరుకునే అవకాశముండటం ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు ఇప్పుడు నిఖిల్ కూడా అదే దారిలో అడుగులు వేస్తుండటం విశేషం. ఇప్పటికే కార్తికేయ 3, ది ఇండియా హౌస్ వంటి ప్రాజెక్టులతో బిజీగా ఉన్న ఆయన, ఓటీటీ ద్వారా మరింత విభిన్నమైన కథాంశాలను అన్వేషించేందుకు సిద్ధమవుతున్నారు.

# ఉదయపూర్ ఎయిర్‌పోర్టులో కొత్త జంట సందడి



టాలీవుడ్ స్టార్ కపుల్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. 26న రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో అత్యంత వైభవంగా వీరి వివాహం జరిగింది. అయితే పెళ్లయిన మరుసటి రోజు ఈ నూతన వధూవరులు ఉదయ్‌పూర్ ఎయిర్‌పోర్ట్‌లో ప్రత్యక్షమవడంతో అక్కడ ఒక్కసారిగా సందడి నెలకొంది. కొత్త పెళ్లికూతురు రష్మిక ఎరుపు రంగు సంప్రదాయ దుస్తుల్లో మెరిసిపోగా, విజయ్ స్టైలిష్ ఇండో-వెస్ట్రన్ అవుట్‌ఫిట్‌లో రాజసం ఉట్టిపడేలా కనిపించారు. తమ అభిమాన జంటను చూడటానికి ఎయిర్‌పోర్ట్‌కు భారీగా చేరుకున్న అభిమానులకు విజయ్, రష్మిక చిరునవ్వుతో అభివాదం చేస్తూ, ఫ్లయింగ్ కిసెస్ ఇస్తూ ఉత్సాహపరిచారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. వీరు నేరుగా ఢిల్లీ వెళ్లి ప్రధాని మోడీని, కేంద్రమంత్రి అమిత్ షాను కలిశారు.

------



# దీపిక అవకాశాలు చేజార్జుకుంటోందా ?

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె ఇటీవల వరుస వార్తలతో ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారుతున్నారు. ఆమె కండీషన్స్ కారణంగా ఇప్పటికే ఒప్పుకున్న ప్రాజెక్టులు చేజారిపోతున్నాయనే ప్రచారం గత కొద్ది రోజులుగా నడుస్తోంది. ముఖ్యంగా టాలీవుడ్‌లో భారీ స్థాయిలో తెరకెక్కుతున్న స్పిరిట్, కల్కి 2 చిత్రాల నుంచి ఆమె బయటకు వచ్చినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా మరో హాలీవుడ్ అవకాశం కూడా చేజారిందనే టాక్ వినిపిస్తోంది. హాలీవుడ్‌లో పాపులర్ సిరీస్‌గా రూపొందిన ది వైట్ లోటస్ నాలుగవ సీజన్ కోసం దీపికా పదుకొనే పేరును మేకర్స్ పరిశీలించినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. గ్లోబల్ రీచ్ ఉన్న ఈ సిరీస్‌లో నటించే అవకాశం దక్కింది అంటే అంతర్జాతీయంగా మంచి గుర్తింపు దక్కే అవకాశం ఉంటుంది. అయితే ఈ ప్రాజెక్ట్ కోసం మేకర్స్ ఆమెను ఆడిషన్‌కు రావాలని కోరినట్లు సమాచారం. కానీ, తాను ఆడిషన్‌కు హాజరు కాలేనని దీపికా స్పష్టం చేసినట్లు టాక్ వినిపిస్తోంది. దీంతో ఆమె స్థానంలో మరో నటిని ఎంపిక చేసుకునే దిశగా 'ది వైట్ లోటస్' టీమ్ ముందుకు సాగిందని తెలుస్తోంది. ప్రముఖ అంతర్జాతీయ సిరీస్‌లో నటించే అవకాశం కోల్పోయిందనే వార్తలతో దీపికా అభిమానులు నిరాశకు గురవుతున్నారు. ఇప్పటికే కొన్ని పెద్ద ప్రాజెక్టుల నుంచి బయటకు వచ్చిన నేపథ్యంలో, హాలీవుడ్ కమ్‌బ్యాక్‌కు ఇది మంచి అవకాశంలా భావించకుండా ఇలా ఎందుకు బయటకు వచ్చిందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు.

-------------------

# కామెడీలో కథాత్మక జోడింపు

## విష్ణు విన్యాసం మూవీ





శ్రీవిష్ణుని మ్యాన్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ అనే పేరుంది. దానికి తగ్గట్టే 'విష్ణు విన్యాసం' సినిమాను మొదట్నుంచీ పూర్తి వినోదాత్మక చిత్రంగా ప్రచారం చేశారు. శ్రీవిష్ణు కామెడీ మూవీ అనగానే ఆడియన్స్‌లో అంచనాలు కామన్. దాంతో నిర్మాణంలో ఉండగానే సినిమాపై హైప్ మొదలైంది. దానికి తగ్గట్టు ప్రచార చిత్రాలు కూడా సినిమాపై అంచనాలు పెంచాయి. 'విష్ణు విన్యాసం' అనే టైటిల్ పెట్టి తొలి అడుగులోనే ఆడియన్స్‌లో మార్కులు కొట్టేశాడు దర్శకుడు యదునాథ్ మారుతీరావు. విష్ణు(శ్రీవిష్ణు) ఓ కాలేజ్‌లో ట్రైనీ లెక్చరర్‌గా పని చేస్తుంటాడు. తను పర్మినెంట్ అవ్వాలంటే అల్రెడీ అక్కడ పనిచేస్తున్న లెక్చరర్స్‌లో ఎవరో ఒకరి దగ్గర అసిస్టెంట్‌గా కొన్నాళ్లు పనిచేయాలి. తనెవరి దగ్గరైతే పనిచేశాడో.. వాళ్లకు విష్ణు ప్రవర్తన, కేపబులిటీ నచ్చితే.. వాళ్లు కాలేజ్ హై కమాండ్‌కి రిఫర్ చేస్తే అప్పుడు అతను పర్మినెంట్ లెక్చరర్ అవుతాడు. దీనికోసం సర్వవిధాలా ప్రయత్నిస్తుంటాడు విష్ణు. అయితే.. విష్ణుని ఎలాగైనా కాలేజ్ నుంచి పంపించేయాలని కొందరు లెక్చరర్స్ ప్రయత్నిస్తుంటారు. విష్ణుని ఎవరి దగ్గరా చేరనీయకంపడా పావులు కదుపుతుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో అదే కాలేజ్‌లో పనిచేస్తున్న లేడీ లెక్చరర్ మనీషా(నయన్‌సారిక) విష్ణుని తన అసిస్టెంట్‌గా చేర్చుకుంటుంది. మనీషా అదొక టైప్. అన్ని వ్యసనాలూ ఉన్నట్టు కనిపిస్తున్న మనీషా దగ్గర తప్పక పనిచేస్తుంటాడు విష్ణు. కొన్ని నాటకీయ పరిణామాల కారణంగా మనీషా, విష్ణు ప్రేమలో పడతారు. పెళ్లి కూడా చేసుకోవాలనుకుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో విష్ణుకు మనీషాకు సంబంధించిన ఓ నిజం తెలుస్తుంది. ఇంతకీ ఏవిటా నిజం? అసలు అన్ని వ్యసనాలూ ఉన్న అమ్మాయిలా మనీషా ఎందుకు కనిపించింది? అసలు శ్రీవిష్ణుకు మనీషా ఎందుకు దగ్గరైంది? మనీషాకూ, విష్ణుకీ పెళ్లి జరిగిందా? ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానమే మిగతా కథ. కథలోని కాంప్లిట్టే వైరైటీగా ఉంది. ప్రారంభం నుంచి ప్రశ్నలతోనే కథను మొదలుపెట్టాడు దర్శకుడు యదునాథ్ మారుతీరావు. జాతకాలను అతిగా విశ్వసించే హీరో.. జాతకంలో ఉండకూడని లోపం ఉన్న హీరోయిన్. ఇలాంటి ఇద్దరూ ప్రేమలో పడితే?.. అనేది ఈ కథలో కొత్తపాయింట్. దాన్ని దర్శకుడు మారుతీరావు వినోదాత్మకంగా చెప్పాడు.

# ది కేరళ స్టోరీ 2' చిత్రం విడుదలకు మార్గం సుగమం..

## స్టే ఎత్తివేసిన హైకోర్టు డివిజన్ బెంచ్

'ది కేరళ స్టోరీ 2' సినిమా విడుదల కాకుండా కేరళ హైకోర్టు సింగిల్ బెంచ్ ఇచ్చిన స్టేను డివిజన్ బెంచ్ ఎత్తివేసింది. దీంతో ఈ చిత్రం విడుదలకు మార్గం సుగమమైంది. ఈ చిత్రం విడుదల కాకుండా హైకోర్టు సింగిల్ బెంచ్ ఇటీవల స్టే ఇచ్చింది. సీబీఎఫ్‌సీ తీరును తప్పుబడుతూ సినిమాను పునఃపరిశీలించాల్సిందిగా ఆదేశించింది. 15 రోజుల పాటు సినిమాపై స్టే విధించింది.సింగిల్ బెంచ్ తీర్పును చిత్ర నిర్మాత కేరళ హైకోర్టు డివిజన్ బెంచ్‌లో సవాల్ చేశారు. ఈరోజు సాయంత్రం వరకు ఇరువర్గాల తరపున సుదీర్ఘ వాదనలు విన్న జస్టిస్ సుశ్రుత్ అరవింద్ ధర్మాధికారి, జస్టిస్ పీవీబాలకృష్ణన్‌లతో కూడిన డివిజన్ బెంచ్ సింగిల్ బెంచ్ ఇచ్చిన స్టేను ఎత్తివేసింది. 2023లో విడుదలైన 'ది కేరళ స్టోరీ' చిత్రానికి సీక్వెల్ 'ది కేరళ స్టోరీ 2' రూపొందింది. దీనికి కామాఖ్య నారాయణ్ సింగ్ దర్శకత్వం వహించగా, విపుల్ అమృత్ లాల్ షా నిర్మించారు. ఉల్కా గుప్త, అదితి బాటియా, ఐశ్వర్య ఓజా ఈ చిత్రంలో నటించారు. నిజ జీవితంలో జరిగిన అంశాలతో ఈ చిత్రాన్ని రూపొందించినట్లు చెబుతున్నారు. ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 27న విడుదల చేస్తామని చిత్ర బందం ప్రకటించగా, సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పుతో వాయిదా పడింది. ఈరోజు డివిజన్ బెంచ్ తీర్పుతో ఈ సినిమా విడుదలకు అడ్డంకులు తొలగిపోయాయి.

# 'డెకాయిట్' కోసం వరంగల్ భద్రకాళి ఆలయంలో అడివి శేష్



విడుదలకు ముందు వరంగల్ భద్రకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు శేష్, మృణాల్‌పై చిత్రీకరించిన 'రుబరూ' అనే రొమాంటిక్ సాంగ్ విడుదల ప్రేమ, ప్రతీకారం నేపథ్యంలో పాన్ ఇండియా స్థాయిలో ఏప్రిల్‌లో రిలీజ్ వరుస విజయాలతో దూసుకుపోతున్న యంగ్ హీరో అడివి శేష్ తన తదుపరి చిత్రం 'డెకాయిట్' ప్రమోషన్లను వినూత్నంగా ప్రారంభించాడు. ఏప్రిల్‌లో సినిమా విడుదలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో, చిత్ర బృందం వరంగల్‌లోని ప్రసిద్ధ భద్రకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించింది. ఈ సందర్భంగా శేష్ మాట్లాడుతూ, ఈ సినిమా తనకెంతో ప్రత్యేకమని, కథ ప్రారంభ దశ నుంచే తాను భాగస్వామిని అయ్యానని తెలిపాడు.ప్రమోషన్స్‌లో భాగంగా చిత్రంలోని తొలి పాట 'రుబరూ'ను విడుదల చేశారు. అడివి శేష్, కథానాయిక మృణాల్ ఠాకూర్‌పై ఈ పాటను చిత్రీకరించారు. ఈ రొమాంటిక్ గీతం సినిమాలోని భావోద్వేగాలను చక్కగా ప్రతిబింబిస్తుందని అడివి శేష్ అన్నాడు. "ప్రేక్షకులతో ఈ కథను పంచుకునే ముందు, అమ్మవారి ఆశీస్సులు తీసుకోవాలనుకున్నాను. ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డాం. ఏప్రిల్‌లో మీరందరూ చూస్తారని ఆశిస్తున్నాను" అని పేర్కొన్నాడు.




Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com